PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 24 | విజయవాడ, ఆదివారం 24 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 24 August 2025 | Rs

ఉక్కు ప్రైవేటీకరణపై 3న మహాప్రదర్శన

- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం
- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నేటి నుంచి నిరసన

2



6

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-4 విజేత

తుంగభద్ర వారియర్స్



స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబు

స్వర్ణాంధ్ర కావాలంటే...

ఆలోచనా విధానం మారాలి

- రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సూచన
- మహానగరాలుగా అమరావతి, విశాఖ, తిరుపతి
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, సామర్లకోట

స్వర్ణాంధ్ర కావాలంటే ముందుగా ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని రాష్ట్ర ప్రజానీకానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం ఆయన పర్యటించారు. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పెద్దాపురం పట్టణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ర్యాలీలో చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ రోడ్లపైన, ఇంటి ముందు చెత్త వేయడం వల్ల వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. గత వైసిపి సర్కారు చెత్తపై పన్ను వేసినా చెత్తను తొలగించకుండా వదిలేసిందన్నారు. రాష్ట్రాన్ని నూటికి నూరు శాతం స్వచ్ఛాంధ్రగా మారుస్తామని ప్రకటించారు. అక్టోబర్ రెండు నాటికి రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో చెత్తను పూర్తిగా తొలగిస్తామన్నారు. ఈ మేరకు రూ.330 కోట్లతో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని, దీన్ని 18 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్త నుంచి సంపద సృష్టిస్తామని, జిల్లాలో సేకరించిన చెత్తతో విద్యుత్తును తయారు చేస్తామని అన్నారు. అమరావతితోపాటు విశాఖ, తిరుపతిలను మహానగరాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిని ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. పి-4 ద్వారా పేదరికాన్ని రూపుమాపేందుకు చర్యలు చేపట్టామన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్రం నుంచి రు.12 వేల కోట్లు మంజూరు చేయించామని, విశాఖకు రైల్వే జోన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

అమరావతి మునిగిందంటూ వైసిపి విషప్రచారం

రాష్ట్ర రాజధాని అమరావతి మునిగిపోతుందంటూ వైసిపి విషప్రచారం చేస్తోందంటూ చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కారు కింద సొంత కార్యకర్త పడి చనిపోయినా జగన్ పట్టించుకోలేదని, వివేకా హత్య ఘటనలో తనపై తప్పుడు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందారని, కోడి కత్తి డ్రామా ఆడి తానే చేయించినట్లుగా ప్రచారం చేశారని విమర్శించారు. పోలవరం విషయంలో వైసిపి చేసిన తప్పులను తాము సరిదిద్దుతున్నామన్నారు. వికలాంగులు కాని వారికీ గత ప్రభుత్వం పింఛను ఇచ్చిందని ఆరోపించారు. దొంగ పింఛన్లు తీసేసి తిరిగి అర్హులకు అందేలా చర్యలు మిగతా 7లో

రేపు అల్పపీడనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాయువ్య బంగాళాఖాతం, ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో ఈ నెల 25 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని తెలిపింది. మరోవైపు రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అలాగే ధవళేశ్వరం వద్ద ఇన్, అవుట్‌ఫ్లో 12.34 లక్షల క్యూసెక్కులుగా ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. గోదావరి, కృష్ణా, నదుల వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిందని, భద్రాచలం వద్ద ప్రస్తుతం 39.5 అడుగులు నీటిమట్టం ఉండగా, కూనవరం వద్ద నీటిమట్టం 18.99 మీటర్లు, పోలవరం వద్ద 12.65 మీటర్లు నీటి ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం డ్యామ్ వద్ద ఇన్‌ఫ్లో 4.73 లక్షల క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 5.14 లక్షల క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ వద్ద ఇన్‌ఫ్లో 4.45, అవుట్‌ఫ్లో 4.05 లక్షల క్యూసెక్కులు, పులిచింతల వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 3.91 లక్షల క్యూసెక్కులు, ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్, అవుట్‌ఫ్లో 3.92 లక్షల క్యూసెక్కులుగా కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. వరద పూర్తి స్థాయిలో తగ్గే వరకు జాగ్రత్తగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ సూచించారు.

ప్రైవేట్‌కు 'ఎత్తిపోత'లు

సాగునీటి పథకాల అప్పగింతకు సర్కారు కసరత్తు

- రాష్ట్ర వ్యాప్తంగా 999 ప్రాజెక్టులు గుర్తింపు
- హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ అమలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రైవేట్ జపం చేస్తోన్న టిడిపి కూటమి ప్రభుత్వం తాజాగా ఎత్తిపోతల పథకాలనూ ప్రైవేట్‌పరం చేసేందుకు సిద్ధమవుతోంది. పథకాల నిర్వహణను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హమ్)లో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధికారులకు ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసింది. జిల్లాలో మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలు, కొత్తగా నిర్మించాల్సిన పథకాలపై నివేదిక రూపొందించాలని ఆదేశించింది. రిపేర్లకు, కొత్త పథకాల నిర్మాణాలకు ఎంతేసి మొత్తంలో నిధులు అవసరమవుతాయో నివేదికలు తయారు చేయాలని సూచించింది.

దీంతో, ఆ మేరకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఎత్తిపోతల పథకాలను హమ్ మోడల్‌లో అప్పగించేందుకు ఈ నెల మొదటి వారంలో అమరావతిలో జిల్లాల అధికారులతో వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాపులో ఆ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 999 ఎత్తిపోతల పథకాలను గుర్తించారు. ఇవి 8.13 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నాయి. ఎత్తిపోతల పథకాలకు ఎంతమేర నిధులు కావాలో నివేదికలను పంపాలని ప్రభుత్వం సూచించడంతో అధికారులు వీటి తయారీలో నిమగ్నమయ్యారు.

పథకాల నిర్వహణకు అవసరమైన నిధుల లెక్క తేలిన తర్వాత ప్రభుత్వం వీటికి టెండర్లను పిలవనుందని సమాచారం. . టెండర్లలో ఎంపికైన ప్రైవేట్ వ్యక్తులకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం హమ్ మోడల్‌లో పదేళ్లపాటు అప్పగించనున్నారు. వారికి లబ్ధి కూర్చే విధంగా దీని రూపకల్పన ఉంది.



ముందుగానే 40 శాతం నిధులు ప్రైవేట్ వ్యక్తులకు చెల్లింపు!

పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి)లో కొన్ని అంశాలను సవరించి హమ్ విధానాన్ని రూపొందించినట్లు సమాచారం. పిపిపి బిల్డ్ ఆపరేట్ సిస్టమ్ (బిఒటి) కంటే హమ్ మోడల్ ప్రైవేట్ వ్యక్తులకు రిస్క్ లేకపోవడంతో ఈ విధానాన్ని ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం అమలు చేయనుంది. హమ్ మోడల్‌లో 40 శాతం నిధులను ప్రభుత్వం ముందుగానే ప్రైవేట్ వ్యక్తులకు చెల్లించనుంది. పథకాల నిర్వహణలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం అదనంగా సాయం అందించనుంది.

రైతులపై భారం!

ఎత్తిపోతల పథకాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో అంతిమంగా దాని భారం రైతులపై పడనుందన్న చర్చ నడుస్తోంది. పంపు హౌస్‌ల నిర్మాణం, మోటర్లు, విద్యుత్తు బిల్లులకు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు అవకాశం ఉండడంతో రైతుల నుంచి ఆ మేరకు డబ్బులు వసూలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని పొందుతున్న రైతుల నుంచి ఎకరాకు రూ.200 చొప్పున నీటితీరువా కింద ప్రభుత్వం వసూలు చేస్తోంది. ఎత్తిపోతల పథకాలకూ ఎకరాకు ఎంత వసూలు చేస్తే బాగుంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.



విజయనగరం జిల్లా రాజాంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

2

పిఏసిఎస్‌ల్లో నోస్టాక్!

- ప్రైవేట్ డీలర్ల వద్దే యూరియా
- బారులు తీరుతున్న రైతులు, తోపులాటలు

నేడు సురవరం అంతిమయాత్ర

- ప్రభుత్వ లాంఛనాలతో వీడ్కోలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిపిఐ అగ్రనేత, ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకరరెడ్డి అంతిమయాత్రను ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఆయన చిన్న కుమారుడు నిఖిల్ అమెరికా నుంచి రావాల్సి ఉన్నందున భౌతికాయాన్ని కొండాపూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు అక్కడి నుంచి హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు భౌతికకాయాన్ని తరలించనున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల సందర్శనార్థం మధ్యాహ్నం మూడు గంటల వరకు అక్కడే ఉంచుతారు. అనంతరం అధికారిక లాంఛనాలతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి వరకు అంతిమయాత్ర నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో భౌతికకాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు సిపిఐ నేతలు అప్పగించనున్నారు.



ఉత్తరాఖండ్‌లో సహాయక చర్యలు చేపట్టిన సైనిక సిబ్బంది

ఉత్తరాఖండ్‌లో

మరోసారి క్లౌడ్‌బరస్ట్

- ఒకరు మృతి, పలువురు గల్లంతు
- ఇళ్లు, మార్కెట్లను ముంచెత్తిన వరద
- కొట్టుకుపోయిన వాహనాలు, నేలకొరిగిన చెట్లు, రహదారులు బ్లాక్

చమోలీ : ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చమోలీ జిల్లాలో కుంభవృష్టి కురియడంతో 12.40 గంటల ప్రాంతంలో తరాలీ పట్టణంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో ఒక యువతి శిథిలాల కింద పడి ప్రాణాలు కోల్పోగా, పలువురు గల్లంతైనట్లు తెలుస్తోంది. మెరుపు వరదల ధాటికి అనేక ఇళ్లు, వాహనాలు కొట్టుకుపోయాయి. రాళ్ళు రప్పలు, శిథిలాలతో పలు చోట్ల రోడ్లు మూసుకుపోయాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు భారీగా నష్టం సంభవించింది. వెంటనే స్పందించిన భారత సైన్యం పదాతి దళం మిగతా 7లో

యుద్ధోన్మాది ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాల్సిందే

- నెదర్లాండ్స్ (డచ్)లో ముగ్గురు మంత్రుల రాజీనామా



కాస్పర్

ఆమ్‌స్టర్‌డామ్ : అమెరికా అండతో గాజాలో మారణకాండ సాగిస్తున్న యుద్ధోన్మాది ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాల్సిందేనని నెదర్లాండ్స్ (డచ్) విదేశాంగ శాఖ మంత్రి కాస్పర్ వెల్డ్‌కాంప్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందుకు నిరాకరించడంతో శుక్రవారం నాడు ఆయనతో పాటు మరో ఇద్దరు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. న్యూ సోషల్ కాంట్రాక్ట్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కాస్పర్.. ఇజ్రాయిల్ దిగుమతులపై నిషేధం విధించాలని, అక్కడి ఉన్నతాధికారులను దేశంలోకి అనుమతించరాదని పార్లమెంటులో ప్రతిపాదించారు. భాగస్వామ్య పక్షాలు అందుకు మద్దతు ఇవ్వకపోవడంతో డచ్ ప్రభుత్వం ఇజ్రాయిల్‌పై ఆంక్షల విధింపునకు నిరాకరించింది. దీనికి నిరసనగా కాస్పర్, ఆయనకు మద్దతుగా మరో ఇద్దరు మంత్రులు రాజీనామా చేశారు. మరోవైపు ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కసరత్తు చేస్తున్నారు.

రాజ్యాంగానికి సవాళ్లు

- ప్రజాస్వామ్యంలో లోటు ఏర్పడింది
- పార్లమెంట్‌లో అంతరాయాలు కూడా నిరసనే
- కుల గణన జరగాలి
- పిటిఐ ఇంటర్వ్యూలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి అన్నారు. పిటిఐకి ఆయన శనివారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను మావోయిస్టులకి మద్దతిచ్చానంటూ హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా చేసిన ఆరోపణతో పాటు వివిధ అంశాలను ప్రస్తావించారు. పార్లమెంట్‌లో అంతరాయాలు కూడా ఒక రకమైన నిరసనే అని, ఇవి ప్రజాస్వామ్యంలో కీలకమైనవని చెప్పారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా :

తీవ్ర ఒత్తిళ్లలో ప్రజాస్వామ్యం

'గతంలో ఆర్థిక వ్యవస్థలో లోటు గురించి చర్చించేవారం, కానీ ఇప్పుడు ప్రజాస్వామ్యంలో లోటు గురించి మాట్లాడుకోవాల్సి వస్తోంది. మన దేశంలో రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యం కొనసాగుతున్నప్పటికీ, తీవ్రమైన ఒత్తిళ్లకు లోనవుతోంది. ప్రజాస్వామ్యం వ్యక్తుల మధ్య ఘర్షణల గురించి కాదు, భావజాలాల మధ్య జరిగే ఘర్షణల గురించే ఎక్కువగా మాట్లాడుతుంది.' అని సుదర్శన్‌రెడ్డి అన్నారు. 'గతంలో మనం ఆర్థికవ్యవస్థలో లోటు గురించి మాట్లాడుకునే వారం, కానీ ఇప్పుడు ప్రజాస్వామ్యంలో లోటు గురించి మాట్లాడుకుంటున్నాం. గతంలో పాలకపక్షం, ప్రతిపక్షాలు అనేక జాతీయ సమస్యలపై సమన్వయంతో వ్యవహరించేవి, దురదృష్టవశాత్తూ, ఈనాడు అది కనిపించడం లేదు' అని అన్నారు.

ఇంతకంటే గౌరవం ఏముంది?

ప్రతిపక్షాలు తనను ఏకగ్రీవంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వానికి ప్రతిపాదించడంపై మాట్లాడుతూ 'ఇంతకంటే గౌరవం ఏముంది?' అని ప్రశ్నించారు. 'మొదటగా ఇది వైవిధ్యతను ప్రతిబింబిస్తోంది. రెండవది, ప్రతిపక్షాలన్నీ కలిసి నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఇక మూడవది ఓటింగ్ బలం.. దీనిని విశ్లేషిస్తే దేశంలో 63-64 శాతం జనాభాకు ప్రతిపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. వారందరు కలిసి నన్ను తమ అభ్యర్థిగా ఎంచుకున్నారు.' అని చెప్పారు. 'రాజ్యాంగాన్ని సమర్థిస్తూ ఇన్నేళ్లుగా నా ప్రయాణం జరిగింది. ఒకవేళ నాకు అవకాశం వస్తే రాజ్యాంగాన్ని పరిరక్షించే పనితో ఆ ప్రయాణం ముగుస్తుంది.' అని చెప్పారు.

భావజాలాల మధ్య పోటీ

'ఉప రాష్ట్రపతి ఎన్నిక అంటే నాకూ, ఎన్‌డిఎ అభ్యర్థి సిపి రాధాకృష్ణన్‌కి మధ్య పోటీ కాదు. ఇది రెండు భిన్నమైన భావజాలాల మధ్య పోటీ' అని సుదర్శన్‌రెడ్డి అన్నారు. 'ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వ్యక్తి. నాకు సంబంధించినంత వరకు ఆ భావజాలాన్ని నేనే సమర్థించను. దానినుండి నేను చాలా దూరంగా ఉంటాను. ముఖ్యంగా నేను రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యవాదిని. పోటీ జరిగేది ఈ అంశంపైనే." అని ఆయన చెప్పారు.

అది అసమ్మతిని వ్యక్తం చేయడమే

పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయాలు కలిగించడం కూడా ఒక రకమైన అసమ్మతిని వ్యక్తం చేయడమేనని ఆయన చెప్పారు. 'అంతరాయం అనేది అసమ్మతిని వ్యక్తీకరించడం తప్ప మరొకటి కాదు. మీ అభిప్రాయాలను వెలిబుచ్చడానికి లేదా మాట్లాడేందుకు మిమ్మల్ని అనుమతించనప్పుడు, నిరసన కూడా ఒక రకంగా మాట్లాడడమే అవుతుంది. అంతరాయాలను నేను అలానే చూస్తాను.' అని చెప్పారు

సల్వా జుడుం తీర్పుపై ...

సల్వాజుడుంపై తీర్పు విషయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ఆరోపణల గురించి మాట్లాడుతూ, 'అది సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు. ఆ తీర్పును నేను రాశాను' అని చెప్పారు. 'ఈ విషయమై హోంమంత్రితో ఇంతకు మించి ఘర్షణ పడాలనుకోవడం లేదు' అని అన్నారు. 40 పేజీల వరకు వున్న ఆ తీర్పును అమిత్ షా మొత్తంగా చదివితే బాగుంటుందని చెప్పారు.

కుల గణనకు మద్దతు

'కుల గణన జరగాలి. దానికి మద్దతు ప్రకటిస్తున్నా' అని అన్నారు. ఎవరికి సాయమందాలో, వారి శాతం ఎంత మిగతా 7లో



ఒంగోలులో నిర్వహిస్తున్న ర్యాలీ

ట్రంప్ బానిసగా మోడీ

- బిజెపికి సాగిలపడుతున్న చంద్రబాబు, జగన్
- బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఒంగోలులో సిపిఐ రాష్ట్ర మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలు సృష్టిస్తూ ఆయుధాల విక్రయాలతో లాభాలు ఆర్జిస్తోన్న వేళ... ప్రధాని మోడీ ఆయనకు బానిసగా ప్రవర్తిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఒంగోలులో సిపిఐ 28వ రాష్ట్ర మహాసభ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రష్యా వద్ద చమురు కొనుగోలుపై ట్రంప్ విధించిన ఆంక్షలను మోడీ వ్యతిరేకించకపోవడం శోచనీయమన్నారు. దేశాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని వివరించారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలిజం అణచివేత చర్యల మాటున ఆదివాసీలను ఏరివేసి అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. శవపేటికలపై సైతం జిఎస్‌టి వసూలు చేస్తూ ప్రజల రక్తాన్ని మోడీ పీలుస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా పెత్తనం సాగిస్తున్నారని, ప్రతిపక్ష ముఖ్యమంత్రులను టార్గెట్ చేసేందుకే మోడీ కొత్త చట్టం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రులకు జైలు శిక్ష పడితే పదవి కోల్పోయేలా పార్లమెంటులో చట్టం తేవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదన్నారు. ఆ చట్టాన్ని అమలు చేయాలంటే మొదట గుజరాత్‌లో 12 మందిని హత్య చేసిన అమిత్ షాపై ప్రయోగించాలని అన్నారు. రాజ్యాంగంపై మోడీకి నమ్మకం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్య వాదులమని చెప్పుకునే చంద్రబాబు నాయుడు, జగన్ ఢిల్లీలో నరహంతకుల కాళ్లు మొక్కుతున్నారని ఆగ్రహించారు. అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు సాగు భూములు కట్టబెట్టడం, రాజధాని, పరిశ్రమల పేరుతో రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఊసరవెల్లిలా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మారిపోతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు కమ్యూనిస్టు పార్టీ శక్తి సామర్థ్యాలను కూడగట్టి నిరంతర పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జెవి.సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, జల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు. మహాసభ సందర్భంగా ఒంగోలులో నెల్లూరు బస్టాండ్ నుంచి కొత్త మార్కెట్ వేదిక వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభ విజయవంతాన్ని కాంక్షిస్తూ ఈ ర్యాలీకి సాగర్ హోటల్ సెంటర్ వద్ద సిపిఎం నాయకులు స్వాగతం పలికారు.

కౌలు రైతు ఆత్మహత్య

- వరదల కారణంగా నష్టాలపాలు
- అప్పులు తీర్చలేక పురుగుమందు తాగిన వైనం

ప్రజాశక్తి- వేమూరు (బాపట్ల జిల్లా)


మురళీకృష్ణ (ఫైల్)

వరదల కారణంగా పంట ముంపునకు గురికావడంతో అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగుచూసింది. మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం పోతర్లంకకు చెందిన ఈడుపుగంటి మురళీకృష్ణ (40) అదే గ్రామంలో 5.85 ఎకరాల మెట్ట భూమిని కౌలుకు తీసుకున్నారు. ఒక ఎకరంలో పసుపు, 2.425 ఎకరాల్లో కంద, 2.425 ఎకరాల్లో అరటి సాగు చేశారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం బ్యాంకులోనూ, గ్రామంలో ప్రైవేటుగానూ రుణాలు తీసుకున్నారు. మొత్తం రూ.15 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ప్రస్తుత వరదల వల్ల పంట భూమిలోకి నీరు చేరి పంటలు పాడైపోయాయి. దీంతో, తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అప్పులు తీర్చే దారిలేక ఈ నెల 17న రాత్రి తన ఇంట్లో పురుగుమందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు ఆయనను పొన్నూరులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు గుంటూరులోని హాస్పిటల్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పిఎసిఎస్‌ల్లో నో స్టాక్

- ప్రైవేట్ డీలర్ల వద్దే యూరియా
- బారులు తీరుతున్న రైతులు, తోపులాటలు
- అధిక ధరకు అమ్మకం, పురుగు మందులు కొనాలని వ్యాపారుల షరతు

ప్రజాశక్తి- యంత్రాంగం

పిఎసిఎస్‌ల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. పురుగు మందులు కొంటేనే యూరియా అమ్ముతామని, లేకపోతే అమ్మబోమని వ్యాపారులు తెగేసి చెప్తున్నారు. దీంతో, అవసరం లేకపోయినా రైతుల పురుగు మందులు కొనాల్సి వస్తోంది. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ప్రైవేట్ దుకాణాల ముందు బారులు తీరుతున్నారు. ఈ సందర్భంగా తోపులాటలు కూడా చోటు చేసుకుంటున్నాయి. పిఎసిఎస్‌లు, డిసిఎంఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా ఏ మూలకూ చాలడం లేదు. చాలాచోట్ల 'నో స్టాక్' బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. యూరియా బస్తా రూ.270 కాగా, అదనంగా రూ.150 నుంచి రూ.200 వరకూ వ్యాపారులు వసూలు చేస్తున్నారు. పురుగు మందులు కొనాలనే షరతు వల్ల ఒక్కో రైతుపై రూ.800 వరకూ భారం పడుతోంది.

ఉసూరుమంటూ ఇంటి ముఖం పట్టిన అన్నదాతలు

శ్రీకాకుళం బూర్జ మండలం కేంద్రంలోని ఓ ప్రైవేట్ దుకాణానికి శనివారం 120 బస్తాల యూరియా వచ్చిందన్న సమాచారంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 500 మందికిపైగా రైతులు క్యూలో నిల్చొన్నారు. తహశీల్దార్ వై.వి.పద్మావతి, మండల వ్యవసాయశాఖ అధికారి డి.ఉషారాణి 3.30 గంటల ప్రాంతంలో అక్కడకు చేరుకున్నారు. క్యూలైన్‌లో తోపులాటలు చేసుకోవడంతో తహశీల్దార్ పద్మావతి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు నియంత్రించలేకపోవడంతో మండల వ్యవసాయశాఖ అధికారి డి.ఉషారాణి అమ్మకాలను ఆపేయాలని దుకాణం యజమానిని ఆదేశించారు. యూరియాను పక్కదారి పట్టించి, తమకు ఒక్క బస్తా కూడా ఇవ్వడం లేదంటూ రైతులు ఆగ్రహిస్తూ ఎఒని నిలదీశారు. కూపన్లు పంపిణీ చేసి సోమవారం యూరియా అందిస్తామని చెప్పడంతో రైతులు ఉసూరుమంటూ ఇంటి ముఖం పట్టారు.


విజయనగరం జిల్లా రాజాంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

విజయనగరం జిల్లా రాజాంలో ఓ ప్రైవేట్ యూరియా దుకాణానికి 440 యూరియా బస్తాలు వచ్చాయన్న సమాచారంతో సమీప గ్రామాల రైతులు బారులు తీరారు. తోపులాట కూడా చోటుచేసుకుంది.

మునగపాక పిఎసిఎస్ వద్ద ధర్నా

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు సకాలంలో ప్రభుత్వం ఎరువులు అందజేయకపోవడాన్ని నిరసిస్తూ అనకాపల్లి జిల్లా మునగపాకలోని ప్రాథమిక సహకార సంఘం వద్ద రైతులు ధర్నా చేశారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ రైతుల పక్షపాతి అని ఊదరగొడుతున్న టిడిపి కూటమి ప్రభుత్వం యూరియా ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మునగపాక మండల కేంద్రంలోని రైతులకు వంద టన్నుల ఎరువులు అవసరముండగా ప్రభుత్వం అరకొరగా మాత్రమే సరఫరా చేసిందన్నారు. దీంతో, రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు.

అమరావతిలో తొలగిన వర్షపునీరు

- భవిష్యత్తులో సమస్య రాకుండా చర్యలు
- అధికారులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో ఇటీవల నిలిచిన వర్షపునీరు క్రమంగా తగ్గింది. ఇటీవల వర్షాలకు కొండవీటివాగు, కొట్టేళ్లవాగు నీరు నీరుకొండ, ఐనవోలు, కురగల్లు, శాఖమూరు పరిధిలో నిలిచినపోయిన సంగతి తెలిసిందే. మరోవైపు ఉండవల్లి వద్ద పొలాలు కూడా ముంపునకు గురయ్యాయి. అయితే జాతీయ రహదారితోపాటు అంతర్గత రోడ్ల నిర్మాణ సమయంలో వేసిన మట్టికట్టలు నీటి ప్రవాహాన్ని అడ్డుకున్నాయి. బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో ఎక్కడినీరు అక్కడ నిలిచిపోయింది. అయితే నీరు ఎందుకు నిలిచిపోయిందని గుర్తించే అంశంలో అధికారులు తగిన శ్రద్ధ చూపకపోవడంతో నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. నీరు బయటకు వెళ్లే మార్గాన్ని కూడా గుర్తించలేకపోయారు. ఇదే సమయంలో నీటిని బయటకు ఎలా మళ్లించాలనే అంశంపై 'ప్రజాశక్తి' కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన ఎడిసి అధికారులు, మంత్రి నారాయణ నేరుగా ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించారు. వెంటనే జాతీయ రహదారి దిగువున నీరు వెళ్లేందుకు కాలువ తవ్వాలని సూచించారు. దీంతో సిఆర్‌డిఎ అధికారులు అప్పటికప్పుడు ప్రొక్లెయినర్లు తెప్పించి జాతీయ రహదారి దిగువున గండికొట్టారు. దీంతో వర్షపునీరు బయటకు వెళ్లిపోయింది.

నీరు వెళ్లే మార్గాలను మంత్రి నారాయణతోపాటు, సిఆర్‌డిఎ అధికారులు రెండురోజులపాటు పర్యవేక్షించారు. నీరు తగ్గిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తొలుతే సమస్యను గుర్తించి ఉంటే నీరు వేగంగా బయటకు వెళ్లేదని రైతులు కూడా సూచించారు. మరోవైపు జిఎడి టవర్లలో నీటిని అధికారులు ఇంకా తోడేపనిలో ఉన్నారు. అక్కడక్కడ పనుల కోసం తవ్విన గుంటల్లోనూ నీరు నిలిచిపోయింది. పనులు చేసేందుకు వచ్చిన వర్కర్ల కాలనీలు కూడా నీట మునిగాయి. ఆ నీరంతా నేరుగా బయటకు మళ్లించే మార్గాలపై అధికారులు దృష్టి సారించారు. త్వరలోనే మొత్తం సమస్య పరిష్కారమవుతుందని కమిషనర్ కన్నబాబు తెలిపారు. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గాన్ని సూచించిన ప్రజాశక్తిని పలువురు అధికారులు అభినందించారు.

17 నుంచి అసెంబ్లీ!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వర్షాకాల శాసనసభ సమావేశాలను సెప్టెంబరు 17 నుంచి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనిపై సెప్టెంబరు 4న జరిగే మంత్రిమండలి సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ నెలాఖరులో లేదా వచ్చే నెల తొలి వారంలోనే ఈ సమావేశాలు నిర్వహించాలని భావించినప్పటికీ, కొన్ని రాజకీయ, పాలనాపరమైన కారణాలతో మూడో వారానికి పొడిగించినట్లు తెలుస్తోంది.

సాధారణ స్థితికి గోదావరి

ప్రమాద హెచ్చరికలు ఉపసంహారణ

ప్రజాశక్తి - యంత్రాంగం

మూడు రోజులుగా ఉగ్రరూపాని ప్రదర్శించిన గోదావరి శనివారం నాటికి పూర్తిగా తగ్గింది. భద్రాచలం, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ప్రస్తుతం సాధారణ స్థాయిలో ప్రవాహం ఉంది. భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రికే నీటి ప్రవాహం తగ్గడంతో అక్కడ అన్ని ప్రమాద హెచ్చరికలను అధికారులు ఉపసంహరించారు. ప్రస్తుతం అక్కడ 36.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. భద్రాచలం వద్ద తగ్గినప్పటికీ ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం వరకూ ప్రవాహం కొనసాగింది. రాత్రి ఏడు గంటల తరువాత 11.70 అడుగులకు నీటి మట్టం చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరించారు. కాటన్ బ్యారేజీ నుంచి 9,83,312 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. చింతూరు వద్ద శబరి 30 అడుగులకు చేరుకుని సాధారణ స్థాయికి వచ్చింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు ప్రారంభమయ్యాయి. సోకులేరు వాగు తగ్గకపోవడంతో చింతూరు- విఆర్.పురం మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడలేదు. విఆర్.పురం మండలం రేఖపల్లిలోని పునరావాస కేంద్రాన్ని సిపిఎం ఎంపిపి కారం లక్ష్మి పరిశీలించారు. బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బయటపడిన లంకగ్రామాలు

వరద తగ్గడంతో లంకగ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజులుగా వరద ముంపులో ఉన్న లంకలకు శనివారం నుంచి రాకపోకలు సాగాయి. సఖినేటిపల్లి మండలంలో అప్పనిరాముని లంక, అయినవిల్లి మండలంలో అయినవిల్లి లంక, పి.గన్నవరంలో కనకాయలంక కాజ్‌వే, మామిడికుదురులో అప్పనపల్లి కాజ్‌వేలపై రాకపోకలు కొనసాగుతున్నాయి. ముమ్మిడివరంలోని లంక గ్రామాలకు వెళ్లే రహదారులపై ఇంకా మోకాల్లోతు నీరుంది. ఆ నీటిలోనే గ్రామస్తులు, విద్యార్థులు ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండటంతో 12 గ్రామాలకు రాకపోకలు పున:ప్రారంభం కాలేదు. ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై వరద నీరు తగ్గడంతో రాకపోకలు యధావిధిగా సాగుతున్నాయి. కోయిదా, కట్కూరు, యడవల్లి, తాళ్లగొంది తదితర 15 గ్రామాలకు రాకపోకలు పున:ప్రారంభం కాలేదు. దీంతో పడవలపైనే జనం రాకపోకలు సాగిస్తున్నారు.


ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

శాంతించిన వశిష్ట

నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన వశిష్ట గోదావరి శనివారం కాస్త శాంతించింది. ఆచంట మండలం కోడేరులో పుష్కర ఘాట్‌లలో దాదాపు మూడు అడుగుల మేర వరద తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,14,062 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 32.270 మీటర్లు. స్పిల్ వే దిగువన 23.820 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 32.950 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 23.300 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

ప్రకాశం బ్యారేజీకి స్థిరంగా వరద

ఎగువ నుంచి శ్రీశైలానికి 4,70,192 క్యూసెక్కుల వరద వస్తుండగా బ్యారేజీ పది గేట్లను 18 అడుగుల మేర ఎత్తి దిగువకు 4.20 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు 4.48 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా 26 గేట్లను ఎత్తి 4.08 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 3.87 లక్షల క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 3.81 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి 3.92 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

ఉక్కు ప్రైవేటీకరణపై 3న మహాప్రదర్శన

- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం
- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని
- నేటి నుంచి నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



అభివాదం చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు

విశాఖ ఉక్కు పరిశ్రమను ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ) పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు పూనుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 3న విశాఖలో మహాప్రదర్శన నిర్వహించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. జగదాంబ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు మహాప్రదర్శన జరుగుతుందని, ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరింది. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు అధ్యక్షత వహించారు. జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌లోని 46 కీలక డిపార్టుమెంట్లను ప్రైవేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమైందని, అందులో భాగంగా సెప్టెంబరు తొమ్మిది లోపు బిడ్లు వేయాలని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ద్వారా ప్రకటన జారీ చేసిందన్నారు. ఇఒఐ అనేది ప్రైవేటీకరణకు ప్రతిరూపమని పేర్కొన్నారు. దీనిద్వారా కీలక విభాగాలలో బడా ప్రైవేట్ సంస్థలను రంగంలోకి దించుతారని, కూటమి ప్రభుత్వానికి, కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సంస్థలకు కట్టబెడతారని, పర్మినెంట్ ఎంప్లాయీస్‌ను భారీగా తగ్గిస్తారని, అధికారులకు ఎటువంటి పాత్ర లేకుండా చేస్తారని తెలిపారు. పాత కాంట్రాక్టు కార్మికులను తొలగించి ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను తీసుకువచ్చి వారికి ఎటువంటి కార్మిక హక్కులూ లేకుండా చేసి శ్రమదోపిడీకి పాల్పడతారని చెప్పారు. తొలగించిన ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలను మహిళా, విద్యార్థి, యువజన సంఘాల భాగస్వామ్యంతో ప్రజలకు వివరించి లక్షల సంఖ్యలో కరపత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, వైఎస్ఆర్‌టియు ఉత్తరాంధ్ర నాయకులు పివి.సురేష్, ఆర్.అనిల్‌కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, ఎఐసిటియు నాయకులు కె.శంకరరావు, సిఎఫ్‌టియుఐ నాయకులు డి.శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు నాయినిబాబు, దేముడమ్మ, బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, యుఎస్‌ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, హేమంత్, ఎం.ఈశ్వరరావు, ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమార్ మంగళం, ఎం.సుబ్బన్న, కె.చంద్రశేఖర్, పి.పైడిరాజు పాల్గొన్నారు. తొలుత సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోతోందని, ప్రభుత్వ విధానాల వల్ల అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో శనివారం ఆయన పోస్ట్ చేశారు. కీలక రంగాల్లో మూలధన వ్యయం తగ్గడం వల్ల ప్రభుత్వ ఆదాయం కూడా దారుణంగా పడిపోతోందని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని, అది ఆర్థిక మాంద్యాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయం అంతకుముందు ఏడాదితో పోలిస్తే 3.08 శాతం మాత్రమే పెరిగినట్లు నమోదైందని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థికంగా 12.02 శాతం అభివృద్ధి సాధిస్తుంటే సొంత ఆదాయం 3.08 శాతం మాత్రమే పెరుగుదల ఎలా నమోదైందని ప్రశ్నించారు. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే అదే ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితి ప్రస్ఫుటం అవుతోందని పేర్కొన్నారు. గతేడాడి ఇదే సమయంలో పోలిస్తే వస్తుసేవల పన్ను, అమ్మకం పన్నుల ఆదాయంలో తగ్గుదల కనిపిస్తోందని వివరించారు. ఈ 14 నెలల్లో టిడిపి ప్రభుత్వం రూ.1,86,361 కోట్లు అప్పులు చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పుల్లో 56 శాతం కూటమి ప్రభుత్వం 14 నెలల్లో చేసిందని తెలిపారు. ఆదాయం వృద్ధి తక్కువగా ఉండటం, అప్పులు పెరగడం ఆందోళన కలిగిస్తోందని జగన్ పేర్కొన్నారు.

వికలాంగుల పెన్షన్లపై సర్కారు కర్కశత్వం : మేరుగ

వికలాంగుల పెన్షన్లపై కూటమి సర్కారు కర్కశత్వం ప్రదర్శిస్తోందని, పింఛన్లు తొలగించి వేధిస్తున్నారని మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ చర్యతో నష్టపోయిన వికలాంగులకు వైసిపి అండగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం గ్రీవెన్స్‌లో పాల్గొంటామని తెలిపారు. అర్హతలుండీ పింఛన్లు కోల్పోయిన బాధితులతో వచ్చి గ్రీవెన్స్ ఇస్తామన్నారు. దుర్మార్గంగా పెన్షన్లు ఎలా తొలగిస్తారో చెప్పాలని నాగార్జున ప్రశ్నించారు.

34 మందితో పార్లమెంటు కమిటీలు

- 6న సూపర్ సిక్స్.. సూపర్ హిట్
- సమీక్షలో టిడిపి అధినేత చంద్రబాబు
- వైసిపి విష వృక్షమని విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి పార్లమెంటు కమిటీలను 34 మంది సభ్యులతో ఏర్పాటు కావాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. పార్లమెంటు పార్టీ కమిటీల ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలతో ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం సమావేశమయ్యారు. అధ్యక్షులుతో పాటు ఏడుగురు ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యదర్శులతో పార్లమెంటు కమిటీ ఉండాలని చంద్రబాబు తెలిపారు. పార్లమెంటు కమిటీల నియామకం అత్యంత పారదర్శంగా, పకడ్బందీగా జరగాలని ఆదేశించారు. కమిటీ నియామకంలో సోషల్ రీ ఇంజినీరింగ్ జరగాలని, అన్ని వర్గాల్లో బలమైన నేతలకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. డమ్మీలు, వీక్‌గా ఉండే వాళ్లను పెడితే ప్రభుత్వ, పార్టీ నష్టపోతాయని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు పార్టీ నేతలు మరింత బాధ్యతగా ఉండాలని సూచించారు. యువతకు అవకాశాలు ఇస్తున్నామన్నారు. సూపర్ సిక్స్‌లో చెప్పినట్లు అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని, సెప్టెంబరు 6న అనంతపురంలో హిట్ కార్యక్రమం నిర్వహిద్దామన్నారు. మేనిఫెస్టోలో అనేక హామీలు ఇప్పటికే నెరవేర్చామని, పథకాలు సకాలంలో అమలు వల్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి వర్గానికి ఏదో ఒక లబ్ధి చేకూర్చామని, ఏడాది కాలంలో ఈ పనులు చేయడం గొప్ప ముందడుగు అని తెలిపారు. ప్రజల్లో ఉన్న సానుకూలతను పెంచుకునేలా పార్టీ నేతలు ప్రజల్లో తిరుగుతూ వారితో మమేకమవ్వాలని చెప్పారు. వైసిపి ఒక విష వృక్షమని విమర్శించారు. ప్రజల సమస్యలు, ప్రజల ప్రయోజనాలు వాళ్లకు అనవసరమన్నారు. సంక్షేమ పథకాలపై చర్చ జరగకూడదనేది వైసిపి ప్రధాన లక్ష్యమన్నారు. అర్హుల పింఛన్లు తొలగించలేదని, కానీ వైసిపి మాత్రం లక్షల పింఛన్లు తొలగించినట్లు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారాలతో నిత్యం వాళ్ల రాజకీయాలు సాగుతున్నాయని, ప్రజలకు మనం వాస్తవాలు చెబుతూనే ఉండాలని చెప్పారు. వైసిపి విధానాలను, కుట్రలను ఉదాహరణలతో చెబితే ప్రజలు అర్థం చేసుకుంటారని తెలిపారు. తప్పుడు ప్రచారాలపై మౌనంగా ఉండకూడదన్నారు. పార్టీపై దృష్టిపెట్టి బలోపేతం చేసుకోవాలని, టిడిపి సంస్థాగతంగా చాలా బలంగా ఉంటుందన్నారు. పార్టీ, ప్రభుత్వ ఇమేజ్‌ను పెంచేలా నేతల తీరు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మంత్రులు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న డిఎ బకాయిలు

- ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన డిఎ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇప్పటివరకు మూడు డిఏలు పెండింగ్‌లో ఉండగా, నాలుగో డిఏ కూడా కొద్ది రోజుల్లో జత కాబోతోంది. దీనితో కలిపితే పది నుండి 12 వేల కోట్ల రూపాయలు ఉద్యోగులకు చెల్లించాల్సిఉంటుందని ఆర్థికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడం పట్ల ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బకాయిల కోసం ఎన్నిసార్లు వినతులు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో 2.73 శాతంగా ఉన్న డిఎ డిఏ 2023 జూలై నాటికి 33.67 శాతానికి చేరుకుంది. అయితే అప్పటి నుంచి డిఏ విడుదల కావడం లేదు. అనేక సార్లు ఉద్యోగులతో ఆర్థికశాఖ సమావేశాలు నిర్వహించడం, మధ్యలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ భేటీలు జరగడం, వాటిల్లో ఉద్యోగులు తమ డిమాండ్లను వెల్లడించడం మాత్రమే కనిపించింది తప్ప పరిష్కారం మాత్రం కనిపించలేదు. రెండు రోజుల క్రితం జరిగిన జెఎస్‌సి సమావేశంలో ఇదే అంశంపై చర్చ జరిగింది. ఆ మరుసటి రోజు జరిగిన మంత్రివర్గ భేటీలో డిఏల ప్రకటన ఉంటుందని ఆశగా ఎదురుచూసినప్పటికీ నిరాశ తప్పలేదు. ఇదే సమయం పిఆర్‌సి కమిషన్ నియామకం జరిగినప్పటికీ, ఎప్పుడు చర్చలు ఉంటాయి, ఎప్పుడు నివేదిక ఉంటుంది, ఎప్పుడు అమలులోకి వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఉద్యోగులు వాపోతున్నారు.

భార్యాభర్తల అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- కొత్తవలస (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో భార్యాభర్తలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శనివారం వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.... వేపాడ మండలం చినదుంగాం గ్రామానికి చెందిన కొప్పల చిరంజీవి (28)కి, కొత్తవలస మండలం జోడుమెరక గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి (26)కి ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. పెళ్లయిన నుంచి వీరు అప్పన్నదొరపాలేనికి చెందిన తమ్మన్నమెరక గ్రామంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. చిరంజీవి విశాఖలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, వెంకటలక్ష్మి కొత్తవలసలోని ఒక ఎలక్ట్రానిక్ షాప్‌లో పని చేస్తున్నారు. శనివారం ఉదయం వారు బయటకు రాకపోవడంతో పక్కింటి వారు వెళ్లి చూసేసరికి చిరంజీవి ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతుండగా, వెంకటలక్ష్మి నేలపై పడి ఉన్నారు. దీంతో, వీరి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. కొత్తవలస ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిఎం సూర్యఘర్ పేరుతో దోపిడీ

- అధిక ధరకు సోలార్ ప్యానెల్స్ అమ్ముతున్న కంపెనీలు
- నిర్దిష్ట ధర నిర్ణయించని డిస్కమ్‌లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిఎం సూర్యఘర్ పథకం దోపిడీకి కేంద్రబిందువుగా మారింది. వినియోగదారుల నుంచి ప్రైవేట్ కంపెనీలు చేస్తున్న ఈ దోపిడీలో డిస్కమ్ అధికారులు, ప్రజాప్రతినిధులకు కూడా భాగస్వామ్యం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్లకు పెట్టే రూఫ్‌టాప్ సోలార్‌కు ఒక నిర్దిష్ట ధరను నిర్ణయించకపోవడం వల్లే ఈ దోపిడీకి కారణంగా వినియోగదారులు చెబుతున్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన పిఎం సూర్యఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ రూఫ్‌టాఫ్‌లను రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి నియోజకవర్గంలోనూ 10వేల కనెక్షన్లు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఈ పథకానికి ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, 2కిలోవాట్‌కు రూ.60వేలు, 3 కిలోవాట్‌కు రూ.78వేలు చొప్పున సబ్సిడీ అందిస్తోంది. అన్ని కంపెనీలకు నిర్దిష్ట ధరను ఏర్పాటు చేయాల్సిన డిస్కమ్‌లు తమకు సంబంధం లేదు అనట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఇది వినియోగదారులు, ప్రైవేట్ కంపెనీల ఇష్టమని తమకు సంబంధం లేదంటూ చేతులు దులుపుకుంటున్నాయి. దీంతో రూఫ్‌టాఫ్‌ల ఖర్చును ఒక్కో కంపెనీ ఒక్కో విధంగా వినియోగదారుల నుంచి ప్రైవేట్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి. ఎపిసిపిడిసిఎల్ పరిధిలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసేందుకు 215 ప్రైవేట్ కంపెనీలు ఆ డిస్కం నుంచి అనుమతి పొందాయి. ఎపిఇపిడిసిఎల్ పరిధిలో 117, ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో కూడా సూమారు 200 కంపెనీలు అనుమతి పొందాయి. ఇప్పటి వరకు మూడు డిస్కంలు వాటి పరిధిల్లో సుమారు 40వేల కనెక్షన్లు ఇచ్చాయి. పిఎం సూర్యఘార్ పథకానికి దేశంలో తయారు చేసిన ప్యానెల్స్‌నే ఉపయోగించాలనే నిబంధన ఉంది. 5 కిలో వాట్‌కు ఒక కంపెనీ రూ.2.90లక్షలకు ఏర్పాటు చేస్తుంటే మరో కంపెనీ రూ.3.50లక్షలకు ఏర్పాటు చేస్తున్నాయి.

మరోపక్క ప్రభుత్వ సబ్సిడీ లేకుండా నేరుగా బిగించుకుంటున్న వినియోగదారుల నుంచి ప్రైవేట్ కంపెనీలు తక్కువ ధరను వసూలు చేస్తున్నాయి. విజయవాడలో ఒక వినియోగదారుడి తన ఇంటిపై 5కెవి సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రైవేట్ కంపెనీని ఆశ్రయించగా రూ.3.30లక్షలకు ఏర్పాటు చేసుకునేందుకు ఆ కంపెనీ అంగీకరించింది. సబ్సిడీ కోసం వినియోగదారుడు బ్యాంక్‌ను ఆశ్రయించగా రూ.2.90లక్షలకే మరో కంపెనీ ఏర్పాటు చేసిందని బ్యాంక్ సిబ్బంది చెప్పడంతో నివ్వెరపోయాడు. . సబ్సిడీ పొందే వినియోగదారుడి నుంచి 5కెవికి రూ.3.30లక్షలు తీసుకున్న కంపెనీ, సబ్సిడీ లేని వినియోగదారుడికి రూ.4లక్షలకు 8కెవి బిగించింది. నిర్దిష్టమైన ధరలు, వీటిపై ప్రచారం లేకపోవడంతో తాము నష్టపోతున్నామని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోలార్ రూఫ్‌టాప్‌లు బిగిస్తున్న కంపెనీలతో డిస్కమ్‌లు, అధికార పార్టీ నేతలు కుమ్మక్కైయ్యారనే విమర్శలు వస్తున్నాయి. అసలు ఖర్చు కంటే అధికంగానే వినియోగ దారులనుంచి కంపెనీలు వసూలు చేస్తున్నాయి. ఒక కిలోవాట్ సోలార్ ప్యానెల్స్‌కు అయ్యే ఖర్చు రూ.35వేల లోపే ఉంటుందని విద్యుత్ రంగం నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రైవేట్ కంపెనీలు వినియోగదారుడి నుంచి సుమారు రూ.60వేలకు పైనే వసూలు చేస్తున్నాయి. ఈ అధికంగా వసూలు చేస్తున్న వాటిల్లో నుంచి ఇటు ప్రజాప్రతినిధులకు, అటు డిస్కమ్ అధికారులకు కమీషన్ల రూపంలో అప్పగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కేంద్రం మొండిగా ముందుకెళ్తోంది

రాష్ట్రం గుడ్డిగా సమర్థిస్తోంది

- విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రజానీకం కాపాడుకోవాలి
- 'ప్రజాశక్తి'తో సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించడానికి మొండిగా ముందుకెళుతూ వేగం పెంచుతోంది. ఆ కుట్రను చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం గుడ్డిగా సమర్థిస్తోంది. ప్రైవేటీకరణ జరగదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి ప్రకటించిన తరువాత కూడా ఈ కుట్రను ఆగడం లేదు. విశాఖ ఉక్కును రాష్ట్ర ప్రజానీకం, కార్మికలోకం కాపాడుకోవాలి.' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. విశాఖ ఉక్కును ముక్కలు, ముక్కలుగా ప్రైవేటీకరించడానికి 'ఆసక్తి వ్యక్తీకరణకోసం' టెండర్లు పిలిచిన నేపథ్యంలో ఆయన ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు.



విశాఖ ఉక్కు కర్మాగారం (ఇన్‌సెట్‌లో సిహెచ్ నర్సింగరావు)

ఇంటర్వ్యూ వివరాలు :

ప్ర: 'ప్యాకేజీ ఇచ్చాం.. ఉక్కును కాపాడాం' అని టిడిపి కూటమి నేతలు చేస్తున్న ప్రచారం, తాజా పరిణామాలను తెలియజేస్తారా?

జ : ప్రైవేటీకరణను పూర్తి స్థాయిలో చేపట్టి ఉక్కును కొనేవాడికి ఏ అప్పుల భారమూ లేకుండా చేయడానికే రూ.11,400 కోట్ల ప్యాకేజీ ప్రకటించారు. ఉద్యోగుల జీతాలకు ఒక్క పైసా దీంట్లోంచి కేటాయించలేదు. ప్యాకేజీ అప్పులు తీర్చడానికే వీటిని వినియోగించారు. ఎనిమిదేళ్ల నుంచీ వేతన ఒప్పందం ప్లాంట్‌లో జరగలేదు. కార్మికులు తీవ్రస్థాయిలో వేతనాలను నష్టపోయారు. పది నెలలుగా జీతాలను సక్రమంగా ఇవ్వడం లేదు. ఇంటి అద్దెలూ చెల్లించడం లేదు. 16 రెట్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. రాష్ట్రం నుంచి టిడిపి కూటమికి చెందిన 23 మంది ఎంపీలు పార్లమెంటులో ఉన్నారు. వీరు ఏం సాధించారు? ఉక్కును నిలబెడతామని, ప్రైవేటీకరణ జరగనివ్వబోమని ఎన్నికల ముందు వీరంతా చెప్పారు. ఇప్పుడు ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ స్థాపన కోసం ఢిల్లీలో పైరవీలు చేస్తున్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి ఉంటే, ఏటా రూ.4 వేల కోట్లు భారం ప్లాంట్‌పై తగ్గి ఉండేది. ఈ ఎంపీలు ఎప్పుడైనా కేంద్రాన్ని ఈ విషయమై అడిగారా? చట్టప్రకారం కర్మాగారానికి దక్కాల్సిన గనులనూ కేంద్రం ఇవ్వడం లేదు.

ప్ర : స్టీల్ నాణ్యత పెంచడానికే పెద్ద కాంట్రాక్టర్లకు టెండర్లు పిలిచామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు? మీరేమంటారు?

జ : ఇది పెద్ద అబద్ధం. కార్మికుల్లో నైపుణ్యం, అభివృద్ధి కోసం పెద్ద కాంట్రాక్టర్ల టెండర్లను పిలవడం నిజం కాదు. లోపల పనిచేసే స్థానిక కార్మికులను తొలగించడం ద్వారా బయట వ్యక్తులను లోపల పనిలోపెట్టి ప్రైవేట్ వారికి సులభంగా ధారాదత్తం చేసే వ్యూహంలో భాగంగానే టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఈ నెల 19న పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆ వ్యాఖ్యలు చేశారు. విశాఖ స్టీల్‌లో ఉన్న నైపుణ్య కార్మికులు దేశంలో ఏ స్టీల్‌ప్లాంట్‌లోనూ లేరు. ఈ విషయంపై టిడిపిని మేం ఛాలెంజ్ చేస్తున్నాం.

ప్ర : కార్మికులను వదిలేయడం లేదంటూ టిడిపి నేతల నుంచి వివరణలు వస్తున్నాయి? దీనిపై ఏమంటారు ?

జ : ట్రేడ్ యూనియన్లపైనా పల్లా మాటిమాటికీ అనుచిత వ్యాఖ్యలు దిగడం, నాయకులపై విరుచుకుపడడం చేస్తున్నారు. పోస్ట్ కార్మికులు రెండు వేల మంది ఉన్నారంటూ చెప్పడం హాస్యాస్పదం. సిబిఐ, ఎసిబి సంస్థలు వారి దగ్గరే ఉన్నాయి. చిత్తశుద్ధి ఉంటే వెంటనే విచారణ జరిపించండి. పల్లా వ్యాఖ్యల్లో నిజం ఉంటే కఠిన చర్యలు తీసుకున్నా మాకేమీ అభ్యంతరం లేదు. విశాఖ ఉక్కులో ఉత్పత్తి ట్రేడ్ యూనియన్లు, కార్మికుల శ్రమతోనే అవుతోంది. ఏటా 50 లక్షల టన్నులను ఉత్పత్తి చేస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నుంచీ కార్మికుల ఐక్యతను చీలగొట్టేందుకు, కార్మికుల్లో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుండడం బాధాకరం.

ప్ర : టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక పెద్ద మార్పు ఏదైనా ఉందా?

జ : టిడిపి కూటమి వచ్చాక ఉక్కునగరం మెయిన్ ఎంట్రన్స్ (ప్లాంట్ పైలాన్) వద్దగల కార్మిక దీక్షా శిబిరాన్ని బలవంతంగా తొలగించారు. శిబిరానికి టెంట్ వెయ్యనివ్వడం లేదు. హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చాం. అయినప్పటికీ ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక ప్లాంట్‌లో 4,800 కాంట్రాక్టు కార్మికులను తొలగించేశారు. ప్రస్తుతం ఒక కార్మికుడు ముగ్గురు పనిని చేస్తున్నాడు. జీతాలు ఏ నెలకానెల సక్రమంగా రావడం లేదు. ప్రశ్నించే నాయకులపై ఛార్జిషీట్లు పెట్టి యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోంది. [illegible]

ప్ర: కేంద్ర ప్రైవేటీకరణ విధానాన్ని ఎలా ఎదుర్కొంటారు?

జ : విశాఖ స్టీల్‌ను వంద శాతం వ్యూహాత్మక అమ్మకం చేయాలనుకున్న మోడీ విధానాన్ని కార్మికవర్గం, ప్రజానీకం తిప్పికొడుతూ వస్తున్నారు. అందుకే, స్ట్రాటజిక్ సేల్ దాదాపు విఫలమైంది. అందుకే ముక్కలు ముక్కలుగా విభజించి విక్రయించాలని, ప్రైవేటీకరించేయాలని కుట్రలు చేస్తున్నారు. గతంలో పోస్కో (దక్షిణ కొరియా) సంస్థ ప్రయత్నించి విఫలమైంది. టాటా, జిందాల్ స్టీల్‌ప్లాంట్లు కూడా చేసిన ఒప్పందాలు విఫలమయ్యాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆర్సెలార్ మిట్టల్‌ను రంగంలోకి దించుతోంది. దేశంలోని సముద్ర తీరంలోగల ఏకైక స్టీల్‌ప్లాంట్ విశాఖ. దీనిని కాపాడుకుంటాం. కార్మికవర్గం ఐక్యంగా ప్రైవేటీకరణ కుట్రలను దీనిని ఎదుర్కొంటుంది.


కనకాయ లంక గ్రామంలో వరదనీటిలో వెళ్లి ప్రజలను పరామర్శిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు

రూ.23 కోట్లతో కనకాయలంక కాజ్‌వే

- వరద గ్రామాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటన

ప్రజాశక్తి - యలమంచిలి

గోదావరి లంక గ్రామాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, వరదల సమయంలో భయపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం ఆయన పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన కనకాయలంక, పెదలంక గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు వరదపై వెళ్లి వరద నీటిలో నడిచారు. గ్రామస్తులను పలకరించి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్ల పాలనలో వరదలొస్తే ఏరియల్ సర్వే పేరుతో వైసిపి ప్రభుత్వం గాలిలో చేసిన వాగ్దానాలు గాలిలోనే కలిసిపోయాయన్నారు. వరద సమయంలో కనకాయలంక కాజ్‌వే మునిగితే రాకపోకలు నిలిచి ఎదురయ్యే ఇబ్బందులను శాశ్వతంగా తొలగేలా రూ.23 కోట్లతో వంతెన నిర్మిస్తామని, ఇందుకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెప్పారు. ముంపు గ్రామాల ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలిచ్చారు. అంటురోగాలు, విష జ్వరాలు వ్యాపించకుండా వైద్య శిబిరాల ద్వారా అవసరమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయా గ్రామాల సర్పంచులు మద్దా శ్రీనివాస్, తాళ్ల నాగరాజు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఆనందం వ్యక్తం చేస్తున్న వి.కోట మండలవాసులు

కుప్పంకు 'కృష్ణా' జలాలు

- 30న సిఎం దంపతుల జలహారతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కృష్ణా జలాలు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంకు చేరుకున్నాయి. హంద్రీనీవా కాల్వల ద్వారా పలమనేరు నియోజకవర్గం వి.కోట వరకూ శనివారం వచ్చాయి. ఈనెల 29న కుప్పం పర్యటనలో భాగంగా ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి బెంగళూరు చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో రోడ్డుమార్గాన శాంతిపురంలోని సొంత నివాసంలో బస చేస్తారు. మరుసటిరోజు 30న కరమసముద్రం వద్ద హంద్రీనీవా జలాలను విడుదల చేసి జలహారతి ఇస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగసభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. హంద్రీనీవా కాల్వల ద్వారా కృష్ణా జలాలు వి.కోట మండలం కృష్ణాపురం పంచాయతీ మెట్టపల్లి వద్దకు రావడంతో ప్రజలు జలహారతులు ఇచ్చారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ధర్నా

- జిఒ 77, 42, 35 రద్దు చేయాలి
- గుంటూరు కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జిఒ 77 రద్దు చేయాలని కోరుతూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేటక్ ఎదుట నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ...టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.



కలెక్టరేట్ ధర్నా చేస్తున్న విద్యార్థులు

అధికారంలోకి వచ్చిన వెంటనే జిఒ 77 రద్దు చేస్తామని వాగ్దానం చేసి, అమలు చేయలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, కనీస వసతుల కల్పనకు కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచకపోవడంతో ఆహారంలో నాణ్యత తగ్గిపోతుందని తెలిపారు. మండలానికి ఒక జూనియర్ కాలేజీ, నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్న జిఒ 42, 35లను రద్దు చేయాలని, యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టులు, ఖాళీ వైస్ ఛాన్సలర్ పోస్టులు భర్తీ చేయాలని,అర్హులైన అందరికీ తల్లికి వందనం ఇవ్వాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్.సమీర్, జిల్లా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కష్టాలు

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారని, వారి కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఏ రైతును కదిలించినా ఎరువుల కోసం కన్నీటి వ్యథలే వినబడుతున్నాయన్నారు. తెల్లవారుజాము నుంచే ఎరువుల కేంద్రాల దగ్గర కిలోమీటర్ల క్యూలు ఉంటున్నాయని, కట్ట యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని పేర్కొన్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వానికి రైతాంగంపై ఉన్న చిత్త శుద్ధి? అని ప్రశ్నించారు. 6.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుంటే రైతులకు ఎరువు కరువు ఎందుకొచ్చిందన్నారు. రూ.266కు అమ్మాల్సిన బస్తా ధర మార్కెట్లో రూ.500లకు ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిజంగా కొరతనా? లేక అధికార పార్టీ నేతలు సృష్టిస్తున్న కృత్రిమ కొరత అనే విషయంపై సిఎం చంద్రబాబు.. ప్రజలకు సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయాలని, వెంటనే యూరియా బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు.

వైసిపిది దోపిడీ సిద్ధాంతం

- చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపిది దోపిడీ సిద్ధాంతమని టిడిపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీరో చక్రవర్తిలా రాష్ట్రాన్ని పాలించారని, రాష్ట్ర ప్రజల బాగోగుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. వైసిపి హయాంలో మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి చేసిన దురాగతాలు అనేకం ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వానికి వాటన్నింటిపై జవాబు చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. దొంగకు సాయం చేయాలని చూస్తే మీరు కూడా దొంగలవుతారని హెచ్చరించారు.

విఆర్‌ఒలపై ఒత్తిడి తగదు

- భూపతిరాజు రవీంద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో విఆర్‌ఒలపై ఒత్తిడి తగదని విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎటువంటి వివరాలు లేకుండా పర్మినెంటు క్యాస్ట్ సర్టిఫికెట్లు జారీ చేస్తే రానున్న రోజుల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంపై ప్రభుత్వం పునరాలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్కు కోసం కలిసి పోరాడతాం : బొత్స

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుని తీరుతామని, అందుకోసం ఏ రాజకీయ పార్టీతోనైనా కలిసి నడుస్తామని వైసిపి సీనియర్ నాయకులు, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. తన క్యాంపు కార్యాల యంలో ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణిలతో కలిసిన నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి సర్కారు అధికారం చేపట్టాక ప్లాంట్‌లో ప్రయివేటీకరణ చర్యలు వేగవంతమయ్యాయని తెలిపారు. వైసిపి హయాంలో ఉక్కు ప్రయివేటీకరణ జరగకుండా అడ్డుకున్నామని చెప్పారు. ఈ నెల 30న విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశానికి వస్తున్న ఆ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉక్కు ప్రైవేటీకరణపై స్పందించాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ను ఇష్టారాజ్యంగా ముక్కలు చేసి అమ్మేయాలని చూడడం దారుణమన్నారు. ఉక్కును ఇలా ముక్కలు చేస్తుంటే ఈ సంవత్సర కాలంలో 16 సార్లు ఢిల్లీకెళ్లి ప్రధానిని కలిసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సాధించిందేమిటని ప్రశ్నించారు. ఉక్కుపై తమ పార్టీ కార్యాచరణ చేస్తోందని తెలిపారు. టిడిపి కూటమి పాలనలో భూ కబ్జాలకు అంతులేకుండా పోయిందని, అధికార పార్టీ నాయకులు, మంత్రుల అవినీతి, అక్రమాలు, భూ దందాలు ఇష్టారాజ్యంగా పెరిగిపోయాయని ఆరోపించారు. చంద్రబాబు వారందరికీ ఆ పనుల కోసం 'పట్టా' రాసిచ్చేసినట్టుందని విమర్శించారు. వికలాంగుల పింఛన్ల తొలగింపు దారుణమని, అర్హులైన వారి పక్షాన పోరాడతామని చెప్పారు.

సమస్యలపై తక్షణమే చర్చలు

- ప్రభుత్వానికి ఎపి జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘం తక్షణమే ఉద్యోగ సంఘాలతో చర్చించాలని ఎపి జెఎసి అమరావతి డిమాండ్ చేసింది. మూడు నెలల్లోగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ సంఘాలతో చర్చించి ఉద్యమబాట పట్టాల్సి ఉంటుందని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు అధ్యక్షతన శనివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవనంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు.

తక్షణమే పెండింగ్ డిఎలు ప్రకటించాలని, ఏ ఉద్యోగికి, పెన్షనర్‌కు ఎంతెంత బాకీ ఉందనే వివరాలు సిఎఫ్ఎంఎస్ పే స్లిప్పుల్లో వచ్చేలా చూడాలన్నారు. ఈ నెల 20న సిఎస్ ఆధ్వర్యాన జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఇక పెరోల్‌కు లేఖ ఇవ్వను..

- ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

నెల్లూరుకు చెందిన జీవిత ఖైదు శ్రీకాంత్ పెరోల్ కోసం లేఖ ఇచ్చానని, అది తప్పని తెలిసిందని, ఇక జీవితంలో పెరోల్‌కు లేఖ ఇవ్వనని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాంత్ పెరోల్ కోసం అతని తండ్రి, సోదరుడు తన దగ్గరకు వచ్చారని, తాను, గూడూరు ఎంఎల్‌ఎ పాశం సునీల్‌కుమార్ ఇద్దరం లేఖ ఇచ్చామని చెప్పారు. ఆ లేఖ తిరస్కరిస్తూ హోం శాఖ లేఖ రాసిందన్నారు. సరిగ్గా 14 రోజుల తరువాత శ్రీకాంత్‌కు పెరోల్ మంజూరైందన్నారు. దానికి తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తనపై వైసిపి నేత ఆనం విజయకుమార్ రెడ్డి విమర్శలు చేశారన్నారు. తాను పాలడబ్బాకు కూడా డబ్బులు లేని వ్యక్తినని, ఇప్పుడు కోట్ల రూపాయలు సంపాదించానని విమర్శించారన్నారు. నిజమేనని, తన కుటుంబానికి అనేక మంది స్నేహితులు సాయం చేశారని చెప్పారు.

నంద్యాలలో బిటెక్ విద్యార్థి బలవన్మరణం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్


భాను ప్రకాష్ (ఫైల్)

నంద్యాల జిల్లా పాణ్యం మండలం రాజీవ్‌గాంధీ మెమోరియల్ (ఆర్‌జిఎం) ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కడప జిల్లా పులివెందుల మండలం తాటిరెడ్డిపల్లికి చెందిన వి.భానుప్రకాష్ (19) ఆర్‌జిఎం కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. శనివారం ఉదయం తన తోటి విద్యార్థులు తరగతులకు వెళ్లిన తర్వాత హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని భానుప్రకాష్ బలవన్మరణానికి పాల్పడ్డారు. 'శుక్రవారం అర్ధరాత్రి ఆరోగ్యం బాగలేదు. బతకాలని లేదు. చనిపోవాలనుకుంటున్నాను' అని తన తండ్రి రాంభూపాల్‌కు విద్యార్థి మెస్సెజ్ చేశారు. అయితే తండ్రికి చదువురాకపోవడంతో ఆయన గమనించలేకపోయారు. ఫీజు కట్టాలని కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేయడంతోనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. తన కుమారుడి మృతికి కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలని విద్యార్థి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థి మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పాణ్యం పోలీసులు వెల్లడించారు.

ట్రంప్ టారిఫ్‌లపై ఎట్టకేలకు ఖండన

- నచ్చకపోతే భారత ఉత్పత్తులు కొనొద్దు
- యుఎస్ ఆంక్షలపై జైశంకర్



న్యూఢిల్లీ : భారత్‌పై భారీగా టారిప్‌లు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాన్ని భారత విదేశాంగ శాఖ ఎట్టకేలకు తప్పుబట్టింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 50 శాతం టారిఫ్‌లు విధించిన ట్రంప్ నిర్ణయాన్ని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఖండించారు. భారత్ ఉత్పత్తులు నచ్చకపోతే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని శనివారం జరిగిన వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో అన్నారు. తమ వస్తువులు కొనాలని ఎవరూ బలవంతం చేయట్లేదని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలు, ప్రపంచ ఆర్థిక స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. భారత్-అమెరికా వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని చెప్పారు. "మాకంటూ కొన్ని ప్రయోజనాలున్నాయి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. మా రైతులు, చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలను రక్షించడమే మాకు ప్రధానం. దీనిపై మేం రాజీపడే ప్రసక్తే లేదు." అని మంత్రి జైశంకర్ అన్నారు. వ్యాపార అజెండా తో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. అమెరికాకు నిజంగా భారత్‌తో సమస్య ఉంటే.. మా చమురును, శుద్ధి చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయకండని అన్నారు. వాటిని కొనాలని మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయట్లేదన్నారు. ట్రంప్ అదనపు సుంకాలు ప్రకటించడానికి ముందు రష్యా చమురు అంశం గురించి అమెరికాతో ఎలాంటి చర్చలు జరపలేదని వెల్లడించారు. భారత్ రష్యా చమురు కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ చమురు ధరలు స్థిరీకరణకు దోహదపడుతుందన్నారు.

"2022లో చమురు ధరలు భగ్గుమన్నాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళన నెలకొంది. అప్పుడు రష్యా చమురును భారత్ కొనాలనుకుంటే అందులో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రపంచ వ్యాప్తంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే దానివల్లే చమురు ధరలు స్థిరీకరిస్తాయని అందరికీ తెలుసు." అని జైశంకర్ అన్నారు. భారత్ రష్యాతో వాణిజ్యాన్ని పెంచుకోవాలని భావిస్తున్నామని చెప్పారు. అయితే.. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై భారత్ వైఖరి స్పష్టంగా ఉందని, ఆ దేశాల మధ్య ఉద్రిక్తతలు త్వరగా చల్లారాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

అమెరికాకు తపాలా శాఖ సేవలు నిలిపివేత..!

న్యూఢిల్లీ : అమెరికా కస్టమ్స్ అధికారులు ప్రకటించిన కొత్త నిబంధనల్లో అస్పష్టత కారణంగా అమెరికాకు పంపించే ఉత్పత్తుల సేవలను భారత తపాలా శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయం ఆగస్టు 25 నుంచి అమలులోకి వస్తుందని కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. అయితే.. లేఖలు, డాక్యుమెంట్లు, 100 డాలర్ల విలువలోపు గల బహుమతి వస్తువుల డెలివరీ సేవలు కొనసాగుతాయని వెల్లడించింది. జులై 30న అమెరికా ప్రభుత్వం జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం.. ఆగస్టు 29 నుంచి 100 డాలర్లకు మించిన విలువ గల వస్తువులపై కస్టమ్స్ సుంకాలు విధించబడతాయి. ఈ కొత్త నిబంధనల్లో స్పష్టత లేకపోవడంతో అమెరికాకు వెళ్లే విమాన సంస్థలు సరుకు రవాణాను నిరాకరించాయి. దీంతో తపాలా శాఖ ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.



రిటైల్ అమ్మకాలు మందగింపు

- జిఎస్‌టి తగ్గింపు ఆశలు



న్యూఢిల్లీ : దీపావళి కల్లా జిఎస్‌టి రేట్లు తగ్గనున్నాయనే ఆశలతో వినియోగదారులు పలు కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారు. జిఎస్‌టిలో భారీ సంస్కరణలను చేపట్టనున్నామని ఇటీవళ ప్రధాని మోడీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. వస్తు సేవల పన్నుల్లో రెండు శ్లాబులను తెస్తామని చెప్పారు. దీనివల్ల రోజువారీ వస్తువులపై పన్ను తగ్గుతుందని సామాన్య ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు కొనుగోళ్లను వాయిదా వేయడంతో రిటైల్ వ్యాపారులు అమ్మకాల్లో క్షీణత చోటు చేసుకుంటుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. ధరలు తగ్గుతాయనే ఆశతో వినియోగదారులు ఎలక్ట్రానిక్స్, దుస్తులు, గృహోపకరణాల కొనుగోళ్లను వాయిదా వేస్తున్నారు. దీనివల్ల చిన్న వ్యాపారులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మరోవైపు జిఎస్‌టి సంస్కరణలు తమకు ఊరటను కలిగిస్తాయని ఎంఎస్ఎంఇ వర్గాలు ఆశిస్తున్నాయి. జిఎస్‌టి తగ్గింపు ఆశతో కొనుగోళ్ల నిలిచిపోయాయని, అమ్మకాలు తగ్గాయని రిటైల్ వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. పన్ను రేట్లపై స్పష్టత లేకపోవడం రిటైల్ రంగంలో అనిశ్చితిని సృష్టిస్తోందని నిపుణులు భావిస్తున్నారు.

సంపాదకీయం

డిజి - కేరళం

సంజ్ఞలు, చిహ్నాల ద్వారా కమ్యూనికేషన్ సాధ్యమైన ఆదిమ కాలం నుండి ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీ రంగంలోకి అడుగుపెట్టాం. ఈ ఆధునిక కమ్యూనికేషన్...కాంతి వేగంతో అభివద్ధి చెందుతోంది. అందువల్ల, రాబోయే కాలమంతా అనూహ్యమైన సమాచారం, కమ్యూనికేషన్ విస్ఫోటనంతో కూడుకున్నదని నిపుణులు చెబుతున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా అద్భుతమైన కమ్యూనికేషన్ విధానం ఇప్పటికే ఏర్పడింది. డిజిటల్ రంగం ఊహించలేనంత ఎత్తులకు ఎదుగుతూ, విస్తరిస్తున్నప్పటికీ, దానిలోని లోపాలూ అదే స్థాయిలో ఎదురవుతున్నాయి. వీటిలో అధికారిక, ఉన్నత విద్యలోని అనేక దశలను అధ్యయనం చేసిన వారు, సమాజంలోని ఉన్నత స్థాయిల్లోనివారు ఉన్నారు. అక్షరాస్యత అనే పదానికి నిర్వచనం ఇక్కడ పెద్దదిగా మారుతోంది. మనం అక్షరాస్యతను రాతపూర్వక భాష సముపార్జన అని పిలుస్తున్నట్లుగానే, డిజిటల్ టెక్నాలజీ నేర్చుకున్న వారిని కూడా పిలుస్తున్నాం. ఇక్కడే కేరళ పూర్తి డిజిటల్ అక్షరాస్యతను సాధించడంలో ముందడుగు వేసింది. 'జ్ఞానం శక్తి' అని ఫ్రాన్సిస్ బేకన్ అన్నట్లే, నేటి ప్రపంచంలో డిజిటల్ జ్ఞానం అత్యంత శక్తివంతమైన ఆయుధంగా మారింది. ఈ సత్యాన్ని సమగ్రంగా గ్రహించి ముందడుగు వేసిన రాష్ట్రం కేరళ. సామాజిక పురోగతి, విద్య, ఆరోగ్య రంగాల్లోనే కాదు, ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యతలోనూ కేరళ దేశంలోనే ఒక మోడల్ రాష్ట్రంగా నిలుస్తోంది.

'అక్షరాస్యత స్వేచ్ఛకు ద్వారం. డిజిటల్ అక్షరాస్యత ఆధునిక స్వేచ్ఛకు మార్గం' అంటారు విద్యావేత్త కె.జి.సత్యన్. 1991లో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా చరిత్ర సృష్టించిన కేరళ, ఇప్పుడు వంద శాతం డిజిటల్ అక్షరాస్యతను సాధించిన తొలి రాష్ట్రంగా కూడా తన రికార్డును తానే అధిగమించింది. దేశంలో 38శాతం కుటుంబాలే డిజిటల్ అక్షరాస్యత సాధించగా, కేరళ మాత్రం సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతను సాధించి, తన ప్రత్యేకతను నిలుపుకొంది. కరోనా సమయంలో పుల్లంపారా అనే గ్రామ పంచాయతీ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమై, రాష్ట్రమంతా విస్తరించి.. 'డిజి-కేరళం'గా రూపుదిద్దుకుంది. సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్‌ను ఎలా వెలిగించాలి దగ్గర మొదలై... కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ ఎలా వాడాలి, ఎలా టైప్ చేయాలి, వాటిని నిత్య జీవితంలో వివిధ పనులకు ఎలా వినియోగించాలనే అంశాల వరకు ఈ శిక్షణ శిబిరాల్లో నేర్పించారు. వయసు, విద్యార్హత, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తినీ డిజిటల్ అక్షరాస్యుడిగా మార్చాలన్న లక్ష్యంతో కేరళలోని వామపక్ష ప్రభుత్వం 'డిజి-కేరళం' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 14ఏళ్లు పైబడి, డిజిటల్ పరిజ్ఞానం లేని దాదాపు 22లక్షల మందిని గుర్తించి, శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం రాష్ట్ర ఆర్థిక, గణాంక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ అక్షరాస్యత పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులు కానివారికి తిరిగి శిక్షణ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతం చేయడంలో 2.57లక్షల మంది వలంటీర్లు కీలకపాత్ర పోషించారు.

డిజిటల్ అక్షరాస్యత భవిష్యత్ సమాజపు పునాది. పుస్తక అక్షరాస్యతలో కేరళ ఖ్యాతిగాంచినట్లే, ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యతలోనూ దేశానికి ఆదర్శంగా నిలిచింది. డిజిటలైజేషన్ అనేది భౌతిక-వర్చువల్ ప్రపంచాలను కలిపే వారధి. ప్రపంచానికి మనల్ని దగ్గర చేస్తుంది... మన పరిధులను విస్తరిస్తుంది. ఇది గొప్ప ఈక్వలైజర్. వ్యక్తులకు వారి వారి నేపథ్యం, పరిస్థితులతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందడానికి, విజయవంతం కావడానికి అవకాశాలను అందిస్తుంది. కేరళ ప్రభుత్వం కూడా అదే చేసింది. డిజిటల్ నిరక్షరాస్యులను గుర్తించి, వారిని డిజిటైజ్ చేసి, ప్రపంచం మన చేతివేళ్ల దగ్గరే వుందన్న ఆలోచనకు బీజం వేసింది. 'డిజిటల్ టెక్నాలజీ కేవలం ఒక సాధనం మాత్రమే కాదు, పురోగతికి ఉత్ప్రేరకం... కొత్త అవకాశాలకు ప్రవేశ ద్వారం' అంటారో సాంకేతిక నిపుణుడు. కేరళ చూపుతున్న ఈ దారి, భారతదేశం డిజిటల్ సమానత్వం వైపు నడిచేందుకు ఒక మార్గాన్ని సుగమం చేసింది. కేరళ మాదిరిగా టెక్నాలజీని ప్రజల చేతుల్లో పెట్టే దిశగా దేశంలోని ప్రతి రాష్ట్రమూ అడుగులు వేయాల్సిన అవసరం వుంది. అక్షరాస్యతను, డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహిస్తూ ప్రజల్ని డిజిటల్ యుగం వైపునకు నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి.

మహనీయుల మాట



నా శత్రువు నోరు విప్పకుండా చేయగల బలం, బలగం, అధికారం నాకు వున్నప్పటికీ అతను తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను నేను హరించను. చివరికి అతని మాటలు నాపై విమర్శలైనా సరే! అదే ప్రజాస్వామ్యం.

- అబ్రహం లింకన్

ఓట్ చోర్ టు సీట్ చోర్ నిరంకుశ బిల్లు

> **ప్రస్తుతానికి బిల్లు సెలెక్ట్ కమిటీకి పంపాము గనక అక్కడ అభిప్రాయాలు చెప్పవచ్చని అమిత్ షా చెప్పవచ్చుగానీ అక్కడ నిజంగా దాన్ని బుల్డోజర్ చేయడమే జరుగుతుందనేది గతంలో చాలాసార్లు చూశాం. కాకపోతే పార్లమెంటులో బలాబలాల రీత్యా (292-366) ఈ బిల్లు ఆమోదం పొందడం అంత సులభం కాదని లోక్‌సభ మాజీ కార్యదర్శి పిడిటి ఆచార్య అంటున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ముందు బిల్లు తేవడానికి అదీ ఒక కారణమై వుండొచ్చు. ఇప్పటికే ఎస్.ఐ.ఆర్ పేరిట 65 లక్షల ఓట్లు తొలగించిన బీహార్‌లో మోడీ దీని గురించి మాట్లాడటం కూడా వ్యూహాత్మకమే. పహల్గాం ఉగ్ర దాడి పైనా ఆయన అక్కడే మాట్లాడారు. అటు ఉపరాష్ట్రపతి ఎన్నిక, ఇటు బీహార్ ఎన్నికలు బిజెపి తక్షణ ప్రాధాన్యతలైతే తస్మదీయుల తలనొప్పి లేకుండా చేసుకోవడం దీర్ఘకాలిక లక్ష్యం. ఓట్ చోర్ విఫలమైతే సీట్ చోర్ అన్నమాట. వీటన్నిటికీ మూలం మోడీ సర్కారును ఆవరించిన అభద్రతే. ఈ కుట్రలూ కూహకాలను తిప్పి కొట్టకపోతే ప్రజల తీర్పు, చట్టబద్ధ పాలన అన్న మాటలకే అర్థం వుండదు.**





తెలకపల్లి రవి

మోడీ పాలనలో ప్రతిపక్షాలపై కేంద్రం నిర్విరామంగా ప్రయోగిస్తున్న నిరంకుశ త్రిశూల వ్యూహం ఇప్పుడు ఏకంగా రాజ్యాంగ రూపం తీసుకోవడం అప్రకటిత అత్యవసర పరిస్థితికి పరాకాష్ట. ఇప్పటివరకూ హక్కులపై దాడిగా, మతపరమైన రాజ్య భావజాలంగా, రాజకీయ కక్ష వ్యూహంగా నడుస్తున్న నిరంకుశత్వం ఇక నిబంధనగా మార్చనుండటమే ఇందులో దాగిన అతి పెద్ద ప్రమాదం. అది కూడా నేరుగా ప్రభుత్వాధినేతలపైనే. మరో విధంగా చెప్పాలంటే ప్రజల తీర్పు పొందిన నేతలు, పార్టీలపైనే. పార్లమెంటులో హడావుడిగా ప్రవేశ పెట్టిన 130వ రాజ్యాంగ సవరణకు సంబంధించిన మూడు బిల్లులు సరైన దిశలో వున్నా లోతుగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని టిడిపి పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. ఈ బిల్లుల్లో అస్పష్టమైన భాగాలున్నాయని సూచనగా చెప్పారు. అయితే ప్రధాని మోడీ తీసుకున్న నిర్ణయాల మేరకు హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన ఏ బిల్లును కూడా సాంకేతిక సమస్యలు వస్తే తప్ప సర్కారు సవరించుకున్న దాఖలాలు లేవని ఆయనకు బాగా తెలుసు. ఎన్‌డిఎకు అతి పెద్ద మద్దతుదారు ఒక విధంగా ఈ ప్రభుత్వ మనుగడకు కీలకాధారమైన రాజకీయ శక్తి టిడిపికే ఆ సందేహం రావడం కన్నా దానిపై వ్యాఖ్యానం మరేముంటుంది? తర్వాతి మద్దతుదారైన నితీశ్ కుమార్ పాలనలోని బీహార్‌లో అయితే ప్రధాన ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ ఇది ఆయన మెడపై కత్తిలా తెచ్చిన బిల్లేనని రోజూ దెప్పిపొడుస్తున్నారు. భాగస్వాముల భయాలు అలా వుంచి దేశంలోని రాజకీయ పార్టీలూ, విమర్శనాత్మక మీడియా, న్యాయ కోవిదులూ ప్రతి ఒక్కరూ వేరు వేరు కోణాలలో ఈ తాజా బిల్లులపై తీవ్రాందోళన వెలిబుచ్చడానికి కారణమదే.

పోలీసు, జడ్జి, తలారి

అయిదేళ్లకు మించి శిక్ష పడే అవకాశమున్న ఆరోపణపై అరెస్టయి 30 రోజులకు మించి జైలులో వుంటే ప్రధానమంత్రి, కేంద్రమంత్రులూ, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులూ ఎవరైనా 31వ రోజున పదవి కోల్పోతారు. అదే ఈ బిల్లు సారాంశం. పోలీసులు ఎవరిదైనా ఫిర్యాదుపైన లేదా తమకే ఆధారాలు దొరికాయనే పేరిట, ఆదేశాలు అందాయి గనక ఎవరినైనా అరెస్టు చేసి నెల రోజుల పాటు వారికి బెయిలు రాకుండా చూస్తే చాలు వారి పదవి పోయిందన్నమాటే. ఆరోపణ కోర్టులో నిరూపణ జరిగే వరకూ ఆగనక్కరలేదన్నమాట. ఆరోపణల నిర్ధారణ కోర్టుల్లో జరగాలనీ, సుప్రీం కోర్టుదాకా వెళ్లవచ్చుననీ ఇకపైన చెప్పడానికి వుండదు. రాజ్యాంగ పరంగా నేరారోపణల్లో అంతిమాధికారం కోర్టులది తప్ప కార్యనిర్వాహక వర్గానిది కాదు. ఈ ఒక్క బిల్లుతో కేంద్రం సర్వాధికారం చేతుల్లోకి తీసేసుకుంటుంది. ఇటీవలే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ మాట్లాడుతూ కార్యనిర్వాహకవర్గం లేదా పాలక వ్యవస్థనే పోలీసు, జడ్జి, తలారిగా (న్యాయమూర్తిగా, న్యాయ వ్యవస్థగా, అమలుకర్తగా) వుంటానంటే చెల్లుబాటు కాదని ప్రకటించారు, కానీ ఈ మూడు బిల్లులు ఖచ్చితంగా అవే. చట్టం ముందు అందరూ సమానమేననీ, ఎవరైనా సుప్రీం కోర్టుదాకా వెళ్లవచ్చునని చెప్పే సూక్తులు ఒక్క దెబ్బతో తారుమారై పోతాయి. ప్రజల్లో లోతుగా పునాదులూనుకుని ఏళ్ల తరబడి పని చేసి అధికారానికి వచ్చిన అధినేతలనైనా ఈ మాయాజాలంతో మాజీలను చేసేయొచ్చు.

గురుశిష్యుల గతమేంటి?

గడుసు మాటలకూ, ద్వంద్వ రాజకీయాలకూ మారుపేరైన మోడీ, షాలు దురుద్దేశముంటే నేరుగా ప్రధానిని ఈ బిల్లు పరిధిలో ఎందుకు చేరుస్తామంటూ సవాళ్లు విసురుతున్నారు. మొదట ఈ ముసాయిదాలో ప్రధాని పదవి లేకపోతే స్వయంగా మోడీనే కలపాలని చెప్పారని ఆయన గొప్పతనం కీర్తిస్తున్నారు. కానీ, ప్రధాని వరకూ ఎందుకు ఒక్క బిజెపి నేతను కూడా ఇంతవరకూ ఆరోపణతో అరెస్టు చేయడం గానీ తొలగించడం గానీ జరగలేదు. స్వయంగా మోడీ గుజరాత్ మారణహోమం సందర్భంలో వ్యక్తిగతంగానూ ప్రభుత్వాధినేతగానూ తీవ్రారోపణలు ఎదుర్కొన్నా అర నిముషమైనా అదికారం వీడింది లేదు. అప్పట్లో హోంశాఖ చూస్తూ తీవ్ర నేరపూరిత ఆరోపణలు ఎదుర్కొన్న అమిత్ షా సంగతి చెబితే పదవికి రాజీనామా చేశానని దబాయిస్తున్నారు. వాటిలో దాగివున్న మతలబేంటో తర్వాత ఆయనకు బిజెపి వ్యవస్థలోనూ దేశ పరిపాలనలోనూ రెండవ స్థానం అప్పగించడంలోనే తెలిసిపోతుంది. మోడీతో రాజీనామా చేయించాలని, రాజధర్మమని ధర్మపన్నాలు పలికిన అప్పటి ప్రధాని వాజ్‌పేయి చేసింది లేకపోగా తర్వాత ఏకంగా తమ తరపున ప్రధాని అభ్యర్థిగా ప్రమోషన్ పొందారు. రథయాత్రతో మత రాజకీయాలు రగిలించిన మోడీ అసలు గురువు అద్వానీ జైలులో వుండటమే గాక సిబిఐ విచారణ ఎంతకాలం ఎదుర్కొన్నా ఏకంగా ఉపప్రధాని కాగలిగారు. ఎదుటి మనిషికి చెప్పేటందుకె నీతులు వున్నాయి అన్నట్టు ఈ బిల్లు తెచ్చి ధర్మరక్షణ అంటున్నారు!

సి.ఎం పై వేటుకు ఎస్.ఐ

ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆమాద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ నాలుగు నెలలు జైలుపాలైనా రాజీనామా చేయకుండా వుండటం వల్లనే తాము ఈ బిల్లు తేవలసి వచ్చిందని ధర్మభంగిమ దాలుస్తున్నారు. మరి లిక్కర్ స్కామ్ విచారణను సాగదీస్తూ ఖచ్చితంగా ఎన్నికల సమయానికి ముందే ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టడం రాజకీయం కాదా? సుప్రీం కోర్టు, ఢిల్లీ హైకోర్టు ఎన్ని సందేహాలు లేవనెత్తినా బేఖాతరు చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా అటూ ఇటూ తిప్పి కొనసాగించింది కేంద్రం కాదా? రాజ్యాంగం ఒప్పుకోకపోతే ఆయన కొనసాగగలిగేవారా? బయటికి వస్తూనే రాజీనామా చేయలేదా? కోర్టులో ఆయనపై నేరం రుజువైతే ఎన్నికల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చినా కూడా దిగిపోవలసి వచ్చేదే కదా? మరి దాన్ని సాకుగా చూపించడం ఎలా పొసుగుతుంది? తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు మంత్రులు పార్థా చటర్జీ, జ్యోతిప్రియలు, తమిళనాడులో సెంథిల్ బాలాజీ కూడా ఆరోపణల తర్వాత కొనసాగారని ఉదహరిస్తున్నారు. నిజం చెప్పాలంటే వాషింగ్ పౌడర్ నిర్మా సూత్రంతో తృణమూల్ ఆరోపిత నేతలను చేర్చుకున్నది బిజెపినే. ఇక సెంథిల్ బాలాజీ విషయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంది. నిజంగా జరగాల్సింది అది తప్ప తమతో వస్తే మాఫీ లేకపోతే సఫా అన్నట్టు చేయడం ఏం ప్రజాస్వామ్యం? ఒక క్లర్క్ లేదా ప్యూన్ ఆరోపణలతో అరెస్టయితే యాభై గంటల్లో ఉద్యోగం కోల్పోతారనీ, అలాంటప్పుడు నెల రోజులు జైలులో వుంటే మంత్రులు, ముఖ్యమంత్రులు ఎలా అర్హులవుతారని బీహార్ సభలో స్వయంగా మోడీనే వ్యాఖ్యానించారు. నిజానికి ఉద్యోగులను కూడా ఉన్నఫళాన తీసేయడానికి చట్టాలు ఒప్పుకోవు. చాలా తతంగం వుంటుంది. వారికీ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకూ అసలు పోలికేమిటి? అరెస్టు కావడం వేరు, అరెస్టు చేయించబడటం వేరు. బిజెపి హయాంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మంత్రులనే టార్గెట్ చేసుకున్న తర్వాత ఏదో ఒక సాకుతో, వంకతో అరెస్టు చేయించడం కేంద్ర దర్యాప్తు సంస్థలకు సమస్యే కాదు. ఒక ఎస్ఐ స్థాయి పోలీసు ముఖ్యమంత్రి భవిష్యత్తుతో అంటే రాష్ట్ర ప్రభుత్వ మనుగడతో చెలగాటమాడతారన్న మాట. కోర్టులలో అప్పీలు చేసుకోవడం వాయిదాల మధ్య నెల రోజులు ఇట్టే గడిపేయడం, 31వ రోజున మీరు పదవి కోల్పోయారని ప్రకటించడం ఏం ప్రజాస్వామ్యం? సైనిక ముఠాల నీడలో ప్రభుత్వాలు నడిచే దేశాలలో తమకు నచ్చని వారిపై ఆరోపణల మీద అరెస్టు చేయడం, మరొకరిని గద్దెనెక్కించడం నిరతం చూస్తుంటాం. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలోనూ అలాంటి పిల్ల వ్యవహారాలు నడిపించడాన్ని అనుమతించుదామా?

> **ప్రధానిని నామకార్థంగా ఈ పరిధిలో చేర్చినా ఎలాగూ ఆయనను అంటుకోవడం జరగదు. ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రంలో భాగస్వామ్య పక్షాల మంత్రులు, బిజెపిలో కూడా తనకు నచ్చని వారు టార్గెట్ అవుతారన్నమాట. స్పష్టంగా చెప్పాలంటే ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన మరుక్షణం ఆ ప్రభుత్వాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోతుంది. మరొకరిని ఎన్నుకోవడానికి పట్టే సమయంలో గవర్నర్ల రాజ్యం నడుస్తుంది. లేదా వారే లొంగిపోయేవారైతే కూటమిలో చేర్చుకోవడమే. పోలీసులు, దర్యాప్తు సంస్థలను కూడా ఇది తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తుంది. పైగా వ్యవస్థల మధ్య సంబంధాలను తారుమారు చేసేస్తుంది.**

అన్ని వ్యవస్థలకూ చేటు

ప్రతిపక్షాలపై దాడి మాత్రమే గాక రాజ్యాంగ పరంగా రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి వంటి వారి హక్కులను కూడా ఈ బిల్లు హరించి వేస్తుంది. రాజ్యాంగం 75(1)వ అధికరణం రాష్ట్రపతి ప్రధాని సలహాపై మంత్రివర్గ ఏర్పాటు, మంత్రుల బాధ్యతలపై ప్రధాని నిర్ణయం వంటి అంశాలు పేర్కొనబడ్డాయి. కాని 130వ సవరణ కింద అవన్నీ వృథాగా మారతాయి. ఎందుకైనా సరే ఒక ఎస్ఐ ఒక మంత్రిని అరెస్టు చేస్తే-ఎఫ్.ఐ.ఆర్ దాఖలైతే చాలు-ఆయన లేక ఆమె 31వ రోజున బయటికి రాలేకపోతే పదవి కోల్పోయినట్టే. ఇక ప్రధాని పాత్ర, రాష్ట్రపతి పాత్ర ఏంకావాలి? రాష్ట్రపతికి కూడా విచక్షణాధికారం లేదన్నమాటే. ఇదే రాష్ట్రాల స్థాయికి వస్తే ముఖ్యమంత్రిని, మంత్రులను గవర్నర్ తొలగించవచ్చునని బిల్లు పేర్కొంటున్నది. మోడీ గద్దె ఎక్కాక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలనే లక్ష్యంగా చేసుకుని ఎలా వెంటాడారో ఫిరాయింపులను ప్రోత్సహించారో చూస్తూనే వున్నాం. గవర్నర్ల ద్వారా సాగించే కుట్రలూ చూశాం. ఈ విషయమై శాసనసభలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్ల ఎడతెగని జాప్యానికి తెర దించుతూ సుప్రీం కోర్టు తీర్పు చెబితే (అది కూడా హోంశాఖ గతంలో ఇచ్చిన సర్క్యులర్ అంశాలకు అనుగుణంగా) కేంద్రం రాష్ట్రపతి ప్రస్తావన పేరుతో దానికీ అడ్డు తగులుతున్నది. మీరు ఇలాంటి ఆదేశాలు జారీ చేయవచ్చునా అని ప్రశ్న లేవనెత్తి ఆ పని తప్పని తన అభిప్రాయంగా అందజేసింది. ఈ వరసలో చూసినప్పుడు తాజా బిల్లులో కుత్సితం దానికదే తెలిసిపోతుంది. ప్రధానిని నామకార్థంగా ఈ పరిధిలో చేర్చినా ఎలాగూ ఆయనను అంటుకోవడం జరగదు. ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రంలో భాగస్వామ్య పక్షాల మంత్రులు, బిజెపిలో కూడా తనకు నచ్చని వారు టార్గెట్ అవుతారన్నమాట. స్పష్టంగా చెప్పాలంటే ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన మరుక్షణం ఆ ప్రభుత్వాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోతుంది. మరొకరిని ఎన్నుకోవడానికి పట్టే సమయంలో గవర్నర్ల రాజ్యం నడుస్తుంది. లేదా వారే లొంగిపోయేవారైతే కూటమిలో చేర్చుకోవడమే. పోలీసులు, దర్యాప్తు సంస్థలను కూడా ఇది తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తుంది. పైగా వ్యవస్థల మధ్య సంబంధాలను తారుమారు చేసేస్తుంది. సీనియర్ న్యాయవాది అమన్ లేఖి బిల్లుపై స్పందిస్తూ ఇది న్యాయపరంగానూ, వ్యవస్థాగతంగానూ పెద్ద తప్పుగా వుందని స్పష్టం చేశారు. బిజెపికి వంత పాడే కొందరు నిపుణులు వంతపాడుతున్నారు గానీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూస్థాన్ టైమ్స్, ట్రిబ్యూన్, టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూ వంటి ప్రముఖ పత్రికలన్నీ సునిశితంగానే తప్పుపట్టాయి. ప్రస్తుతానికి బిల్లు సెలెక్ట్ కమిటీకి పంపాము గనక అక్కడ అభిప్రాయాలు చెప్పవచ్చని అమిత్ షా చెప్పవచ్చుగానీ అక్కడ నిజంగా దాన్ని బుల్డోజర్ చేయడమే జరుగుతుందనేది గతంలో చాలాసార్లు చూశాం. కాకపోతే పార్లమెంటులో బలాబలాల రీత్యా (292-366) ఈ బిల్లు ఆమోదం పొందడం అంత సులభం కాదని లోక్‌సభ మాజీ కార్యదర్శి పిడిటి ఆచార్య అంటున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ముందు బిల్లు తేవడానికి అదీ ఒక కారణమై వుండొచ్చు. ఇప్పటికే ఎస్.ఐ.ఆర్ పేరిట 65 లక్షల ఓట్లు తొలగించిన బీహార్‌లో మోడీ దీని గురించి మాట్లాడటం కూడా వ్యూహాత్మకమే. పహల్గాం ఉగ్ర దాడి పైనా ఆయన అక్కడే మాట్లాడారు. అటు ఉపరాష్ట్రపతి ఎన్నిక, ఇటు బీహార్ ఎన్నికలు బిజెపి తక్షణ ప్రాధాన్యతలైతే తస్మదీయుల తలనొప్పి లేకుండా చేసుకోవడం దీర్ఘకాలిక లక్ష్యం. ఓట్ చోర్ విఫలమైతే సీట్ చోర్ అన్నమాట. వీటన్నిటికీ మూలం మోడీ సర్కారును ఆవరించిన అభద్రతే. ఈ కుట్రలూ కూహకాలను తిప్పి కొట్టకపోతే ప్రజల తీర్పు, చట్టబద్ధ పాలన అన్న మాటలకే అర్థం వుండదు. ★

మాన్సాస్ ఆస్తులపై హక్కు ఎవరిది?

ఎం. శ్రీనివాస

> **ట్రస్ట్ ఆస్తులు అంటే విజయనగరం ప్రజల ఆస్తి. విజయనగరం చారిత్రక సంపద. ఇవి వ్యక్తుల పేరునే ఉండి ఉంటే, జమీందారీ వ్యవస్థ రద్దయిన తర్వాత ప్రభుత్వ పరమయ్యేవి. కానీ అలా జరగకుండా ఉండటానికి, ట్రస్ట్‌ను అడ్డం పెట్టుకున్నారు. ఇప్పుడు వడ్డించే వాడే మనోడు కాబట్టి, సొంతం చేసుకునే పని ప్రారంభమైంది. ఇది ఆగాలంటే ప్రజాసంఘాలు, పౌర సమాజం ఒత్తిడి తేవాలి. మాన్సాస్ ఆస్తులను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలి. చారిత్రక సంపదను పరిరక్షించాలి.**

ఈ మధ్య కాలంలో మాన్సాస్ ట్రస్ట్ వ్యవహారాలపై పెద్ద చర్చ నడుస్తున్నది. ట్రస్ట్ ఆస్తులపై వ్యక్తులు ఆధిపత్యం సంపాదించడానికి చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు కారణం. దొంగలు దొంగలు కలిసి ఊళ్ళు పంచుకున్నట్లు, దీనికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు తోడయ్యారు. కొన్ని ట్రస్ట్ ఆస్తుల విలువ కోట్లలో ఉండటంతో, బెల్లం చుట్టూ ఈగల్లా పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా చేరుతున్నారు.

విజయనగరం మాన్సాస్ సంస్థ 1958 నవంబర్ 12న స్థాపించబడింది. విజయనగరం సంస్థానం చివరి రాజు డాక్టర్ పి.వి.జి. రాజు ఈ సంస్థను తన తండ్రి మహారాజా అలక్ నారాయణ్ గజపతి రాజు జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. మన్సాస్ ట్రస్ట్ ఒక ప్రైవేట్ సంస్థ అయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండౌమెంట్స్ యాక్ట్-1987 సెక్షన్ 6ఎ (1) కింద నమోదై ఉంది. దీనివల్ల సంస్థ వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నియంత్రణ ఉంటుంది. ట్రస్ట్ వారసత్వం వంశపారంపర్యంగా వస్తున్నప్పటికీ, ఛైర్మన్ నియామకంలో ప్రభుత్వమే ఉత్తర్వులు జారీ చేస్తూ ఉంటుంది. ఈ ట్రస్ట్ కింద ఉన్న ఆలయాలు, వాటి భూములకు సంబంధించిన వ్యవహారాలపై కూడా ప్రభుత్వానికి అధికారాలు ఉన్నాయి.

మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేజీ నుంచి పీజీ వరకు వివిధ స్థాయిలలో సుమారు 12 విద్యాసంస్థలు నడుస్తున్నాయి. ఆ తర్వాత కూడా 1950 నుండి స్థాపించిన కొన్ని విద్యాసంస్థలు ఉన్నాయి. ఇవిగాక మాన్సాస్ ట్రస్ట్‌కు ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 14,800 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుత విలువలో దీని ఆస్తుల మొత్తం వేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఈ భూములతో పాటు ట్రస్ట్ నియంత్రణలో దాదాపు 108 దేవాలయాలు, వాటి భూములు కూడా ఉన్నాయి.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమీందారీ వ్యవస్థ రద్దు చేయబడింది. 1951లో రాజ్యాంగానికి చేసిన మొదటి సవరణ ద్వారా జమీందారీ వ్యవస్థను రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పించారు. దీనితో, 1949 నుంచి 1951 మధ్య వివిధ రాష్ట్రాలలో జమీందారీ రద్దు చట్టాలు అమలయ్యాయి. అయితే, కొన్ని చోట్ల భూస్వాములు ఈ చట్టాలను కోర్టులో సవాలు చేయడంతో, జమీందారీ వ్యవస్థ రద్దు ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పట్టింది. 1956 నాటికి దేశంలో జమీందారీ వ్యవస్థ పూర్తిగా రద్దయింది.

భారతదేశంలో భూసంస్కరణల చట్టం రాష్ట్రాల వారీగా వివిధ సమయాల్లో అమలులోకి వచ్చింది. జాతీయ స్థాయిలో మార్గదర్శకాలు 1972లో రూపొందించబడినప్పటికీ, చాలా రాష్ట్రాలు 1950ల నుండి 1970ల మధ్యలో వివిధ చట్టాలను రూపొందించి అమలు చేశాయి.

భూసంస్కరణల నుండి తమ భూములను కాపాడుకోవడానికి జమీందా రులు అనుసరించిన వ్యూహంలో భాగమే మాన్సాస్ ట్రస్ట్ ఏర్పాటు. భూసంస్కరణల చట్టాల నుండి కొన్ని రకాల భూములకు మినహాయింపులు ఇవ్వబడ్డాయి.

అనేక రాష్ట్రాల భూపరిమితి చట్టాల నుండి మతపరమైన, విద్యా సంబంధమైన, ధార్మిక సంస్థల కింద ఉన్న భూములకు మినహాయింపు ఇచ్చారు. ఈ సంస్థలు (ట్రస్ట్‌లు) తమ లక్ష్యాల కోసం, అంటే పాఠశాలలు, ఆసుపత్రులు లేదా మతపరమైన కార్యక్రమాల నిర్వహణ కోసం భూమి ఉండటం అవసరమని భావించారు. ఈ మినహాయింపును అడ్డుపెట్టుకొని విజయనగరం రాజ వంశస్తులు మన్సాస్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, తద్వారా తమ ఆస్తులను, భూములను స్వాధీనం చేసుకోకుండా కాపాడుకున్నారు. అలాగే వ్యవసాయ యోగ్యమైన సాధారణ భూమిని కూడా "తోటల" భూమిగా చూపించి, దానిని స్వాధీనం చేయకుండా తప్పించుకున్నారు.


అయితే ఇటీవల కాలంలో ట్రస్ట్ ఆస్తుల నిర్వహణపై వివాదాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా భూముల కేటాయింపులు, విక్రయాలు, ప్రభుత్వ జోక్యం వంటి విషయాలపై విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు నగరంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజార్ స్థలాన్ని 22ఎ నుంచి తప్పించి, ప్రభుత్వ భూమిగా రాజులకు అధికారులు అప్పగించారు. గతంలో సంస్థానాల అధీనంలో ఈ భూమి ఉండేది. సంస్థానాలు రద్దయిన తర్వాత ఈ భూమి ప్రభుత్వపరమైంది. తర్వాత చాలా కాలం ఇక్కడ జిల్లా ఆసుపత్రి ఉండేది. శాశ్వత భవనాలు ఏర్పాటైన తర్వాత, జిల్లా ఆసుపత్రి అక్కడికి తరలిపోయింది. తర్వాత ఇక్కడ రైతుబజార్ ఏర్పాటైంది. ఇప్పుడు ఈ స్థలం మాది, మాకు అప్పగించాలని రాజ వంశస్తులు కలెక్టర్ మీద ఒత్తిడి తెచ్చారు. నిబంధనలను ఒక్క కలం పోటుతో మార్చి కోట్లు విలువ చేసే స్థలాన్ని జిల్లా అధికారులు రాజ కుటుంబీకుల చేతుల్లో పెట్టారు. ఇది ఇక్కడితో ఆగలేదు. విజయనగరం చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న 'సింహాచలం మేడ' ను కూడా సొంతం చేసుకుని కూల్చివేశారు. దీని తర్వాత ఒక్కోటిగా మిగిలిన చారిత్రక కట్టడాలను కూల్చివేసే ప్రతిపాదనలు కూడా ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.



ట్రస్ట్ ఆస్తులు అంటే విజయనగరం ప్రజల ఆస్తి. విజయనగరం చారిత్రక సంపద. ఇవి వ్యక్తుల పేరునే ఉండి ఉంటే, జమీందారీ వ్యవస్థ రద్దయిన తర్వాత ప్రభుత్వ పరమయ్యేవి. కానీ అలా జరగకుండా ఉండటానికి, ట్రస్ట్‌ను అడ్డం పెట్టుకున్నారు. ఇప్పుడు వడ్డించే వాడే మనోడు కాబట్టి, సొంతం చేసుకునే పని ప్రారంభమైంది. ఇది ఆగాలంటే ప్రజాసంఘాలు, పౌరసమాజం ఒత్తిడి తేవాలి. మాన్సాస్ ఆస్తులను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలి. చారిత్రక సంపదను పరిరక్షించాలి.

/ వ్యాసకర్త ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ, సెల్: 9490098807 /

వాల్మీకీ, మనోభావాలూ



ఈ మధ్య 'చందమామ' మాస పత్రిక పాత సంచికలు తిరగేస్తుంటే అందులో 'ప్రశ్నోత్తరాలు' శీర్షికలో రెండు ప్రశ్నలు, వాటికి సమాధానాలు కనిపించాయి. అది ఏప్రిల్, 1964 సంచిక.

మొదటి ప్రశ్న: ఫిబ్రవరి సంచికలో సీత వెళ్ళిపోయిన దగ్గర నుండి రాముడు మాంసాహారము, మద్యపానము మానివేశాడని హనుమంతుడు చెప్పినట్టు రాశారు. ఆదర్శమూర్తి అయిన శ్రీరామచంద్రుడు దుర్వ్యసనములలో ఒకటిగా చెప్పు మద్యపానమునకు అంతకు పూర్వమున అలవడియుండినట్టు నమ్మలేము. వాల్మీకి రామాయణము నుండి పై వాక్యము గ్రహించబడినచో "కొటేషన్" ఇస్తారని ఆశించుచున్నాము.

సమాధానం: మీరడిగిన "కొటేషన్" "న మాంసం రామవో భుక్తే న చాపి మధు సేవతే"

- సుందరకాండ, 36వ సర్గ, 40వ శ్లోకం.

మరో ప్రశ్న: "రాత్రి చాలా భాగం గడిచింది. రాక్షస బ్రాహ్మణులు వేదాధ్యయనం ప్రారంభించారు." అన్నారు. రాక్షసులలో గూడ బ్రాహ్మణులుంటారా? వారు పగలు గాక రాత్రి గూడ వేదాధ్యయనం చేస్తారా?

సమాధానం: వాల్మీకిని ఎలా శంకించడం?

ఈ రెండింటినీ మా వీధిలో ఉన్న ఒక వీర మోడీ భక్తుడికి చూపించాను. పట్టలేనంత ఆవేశంతో ఊగిపోయాడు. వెంటనే "అసలు ఆ వాల్మీకి రామాయణాన్ని వేంటనే నిషేధించాలి. అది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసింది" అని కేకలు పెట్టి వెళ్ళిపోయాడు.

ఏతా వాతా నాకనిపించిందేమంటే, ఆ వాల్మీకిని కాపాడే పని కూడా మనకే కట్టబెట్టేలా ఉన్నారీ ప్రబుద్ధులు!

- సుబ్రమణ్యం

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

జెఎన్‌టియుకు ఐఎస్ఒ సర్టిఫికెట్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయానికి ఇంటర్నేషనల్ ఆర్గనైజషన్ ఫర్ స్టాండర్డిజషన్ (ఐఎస్ఒ) రావడం గర్వకారణమని ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. శనివారం స్థానిక జెఎన్‌టియు ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో సర్టిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి ఆరు నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు రావడం ఎంతో గర్వకారణమన్నారు.

ఉమ్మడి 'అనంత'లో ముందుకుసాగని ఖరీఫ్

- ఆగస్టులో వర్షాలొచ్చినా ప్రత్యామ్నాయం లేక ఖాళీ



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముగియడానికి వస్తున్నా ఇప్పటికీ 60 శాతం భూమిలో విత్తనం పడలేదు. 10.4 లక్షల ఎకరాలు బీడుగా ఉంది. 17.33 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ మొదట అంచనా వేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లాలో 9.78 లక్షల ఎకరాలుంటే విత్తనం పడింది 5.07 లక్షల ఎకరాల్లో. 60 శాతం సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 7.55 లక్షల ఎకరాలకుగానూ విత్తనం పడింది కేవలం 1.86 లక్షల ఎకరాల్లోనే అంటే సాధారణ సాగులో 34 శాతమే పంటలు సాగయ్యాయి. కీలకమైన జూన్, జులై నెల్లో వర్షాలు లేకపోవడంతో రైతులు విత్తనం వేసుకోలేకపోయారు. ఆగస్టు మాసంలో మంచి వర్షాలొచ్చినప్పటికీ ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. దీంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా సాగలేదు. అయితే ప్రభుత్వం సమయమునుందున్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ప్రత్యామ్నాయ విత్తనాలేకపోవడంతో ఇతర పంటలు సాగు కూడా అంతంత మాత్రంగానే సాగింది.

గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగు గణనీయంగా తగ్గింది. అనంతపురం జిల్లాలో 4.49 లక్షల ఎకరాలయితే సాగైంది కేవలం 1.71 లక్షల ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 38 శాతమే సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 3.75 లక్షల ఎకరాలు సాధారణ సాగయితే లక్ష ఎకరాల్లోనే విత్తనం వేశారు. 27 శాతమే అయింది. ఇక కంది పంట అయితే సాధారణం కంటే గణనీయంగా పెరిగింది. కంది అనంతపురం జిల్లాలో 1.36 లక్షల ఎకరాలయితే 1.93 లక్షల ఎకరాలయింది. సాధారణం కంటే 142 శాతం అధికమైంది. సత్యసాయి జిల్లాలో 71 వేల ఎకరాలయితే 52 వేల ఎకరాల్లో సాగైంది. సజ్జ పంట అనంతపురం జిల్లాల్లో సాధారణ సాగు 5075కు గానూ 7583 ఎకరాల్లో 149 శాతం సాగైంది. సత్యసాయి జిల్లాలో రెండు ఎకరాలకుగానూ 1341 ఎకరాల్లో అయింది. పత్తి, వరి ఇతర పంటలు కూడా సాధారణం కంటే తక్కువగానే సాగయ్యాయి.

అదునులో ప్రత్యామ్నాయం కరువు

ఖరీఫ్ సీజన్లో కీలకమైన జూన్, జులై నెల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఆగస్టులో అధిక వర్షాలు నమోదయ్యాయి. కరువు మండలాల ప్రకటన జరగాలంటే ఆగస్టు ఆఖరు వరకు సీజన్‌ను చూసి ఐచ్ఛం జరుగుతుంది. ఆ తరువాత కూడా వర్షాభావం ఉంటేనే కరువు పరిస్థితులు వచ్చినట్టు భావిస్తారు. ఆగస్టులో పెద్దఎత్తున ఉమ్మడి జిల్లాలో వర్షపాతం నమోదయింది. మొదటి రెండు నెలలు వర్షాలు పడలేదు. రెండు నెలలు వడపోవడంతో అదునులో పదునులేక రైతులు విత్తనం వేసుకోలేకపోయారు. ఆగస్టులో వేసినా పెద్దగా పంటలొచ్చిన ఉద్దేశంతో రైతులు ప్రధాన పంట వేరుశనగను సాగు చేయలేకపోయారు. దీంతో ఎప్పుడూలేనంత తక్కువగా వేరుశనగ ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పడిపోయింది. ఇక ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం అందజేయాలని ఉండిఉంటే ఆగస్టులో పడుతున్న వర్షాలతోనైనా పంటలు సాగుచేసుకునేందుకు వీలుండేదని రైతులు వాపోతున్నారు.

నకిలీ పురుగు మందులు సీజ్

- బేయర్ కంపెనీ పేరుతో నకిలీలు
- 117 కేసులు సీజ్ చేసిన వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-అనంతపురం



నకిలీ పురుగుమందులను వ్యవసాయాధికారులు శనివారం సాయంత్రం సీజ్ చేశారు. బేయర్ కంపెనీకి సంబంధించిన సొలోమెన్ 500 ఎంఎల్ అనే రకంను డూప్లికేట్ చేసి అనంతపురం నగరంలోని ఒక డీలర్‌కు సప్లై చేశారు. ఈసమాచారం వ్యవసాయాధికారులకు అందటంతో అనంతపురం ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్, మండల వ్యవసాయాధికారి వెంకటకుమార్ నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని శ్రీ సంజీవరాయ ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 117 కేసులు బేయర్ కంపెనీకి సంబంధించి సొలోమెన్ 500 ఎంఎల్ పిచికారి మందు ఉన్నట్టుగా గుర్తించారు. బేయర్ కంపెనీకి సంబంధించి లేబుళ్లు అన్నీ ఉన్నప్పటికీ వ్యవసాయాధికారుల విచారణలో అవి ఆ కంపెనీకి సంబంధించినవి కాదని, డూక్లికేట్‌ని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీంతో వచ్చిన సరుకు మొత్తాన్ని సీజ్ చేశారు. సరుకు ఎక్కడి నుంచి వచ్చిందన్న వివరాలను సేకరించారు. మహేశ్ ఎంటర్ ప్రైజెస్ అకోలా నాగపూర్ నుంచి ఆదిత్య లాజిస్ట్ నుంచి వచ్చినట్టు బిల్లులున్నాయి. మార్కెట్ ధర ప్రకారం దీని విలువ రూ.29 లక్షల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. దీనిపై నగరంలోని ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. సీజ్ చేసిన మందును ఫోరోనిక్స్ ల్యాబ్‌కు కూడా తదుపరి విచారణ నిమిత్తం పంపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

అర్హులందరికీ 'డ్రిప్' అందిస్తాం

ఎపిఎంఐపి పిడి సుదర్శన్

ప్రజాశక్తి-హిందూపురం

అర్హత కలిగిన రైతులందరికీ ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లను అందిస్తామని మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీఎంఐపి ప్రాజెక్ట్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లు అవసరమైన రైతులకు అందిస్తామన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 1400 హెక్టార్లను గుర్తించి 559 హెక్టార్ల మంజూరుకు కలెక్టర్ నుంచి అనుమతుల తీసుకున్నామన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్స్ అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు 1-బి, ఎఫ్ఎంబి స్కెచ్, పొలం చెక్కుబంది సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, కరెంట్ బిల్లు, ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సంవత్సరం ఎస్‌సి,ఎస్‌టి రైతులకు పట్టాదారు పాసు పుస్తకంలో 5 ఎకరాలు వరకు 100 శాతం సబ్సిడీ, పట్టాదారు పాస్ పుస్తకంలో 10 ఎకరాల వరకు ఉన్న ఇతర రైతులకు 90శాతం సబ్సిడీ, 10 ఎకరాలు పైన ఉన్న రైతులకు 50శాతం సబ్సిడీ సబ్సిడీ ప్రకారం డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తామన్నారు. మరింత సమాచారానికి ఆయా డివిజినల్ ఎంఐఎఒలను సంప్రదించాలని సూచించారు.

'ఆశా' పోస్టుల్లో అర్హులకు నిరాశ

- ఇంటర్వ్యూలు జరపకుండానే నియామకాలు
- విలేజ్ హెల్త్ మెడికల్ కమిటీలదే ఫైనల్
- అక్రమాలకు తెర లేపిన అధికార పార్టీ నాయకులు
- ఒక్కో పోస్టుకు రూ. 2 నుండి రూ. 3 లక్షలు వసూలు!

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోయింది. అధికార పార్టీ నాయకులు సిఫార్సు చేసిన వారికే పోస్టులు కట్టబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. విలేజ్ హెల్త్ మెడికల్ కమిటీ పేరుతో స్థానికంగానే ఎంపిక చేసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడంతో అక్రమాలకు చట్టబద్ధత కల్పించినట్లు అయిందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పిహెచ్‌సి, సిహెచ్‌సిల పరిధిలో, అర్బన్ హెల్త్ సెంటర్‌ల పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. అందులో భాగంగా నంద్యాల జిల్లాలో 31 ఆశా పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. పోస్టులకు 300 మంది మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకున్నారు.

ఈ పోస్టుల భర్తీలో ఒంటరి మహిళలకు, ఎస్‌సి, ఎస్‌టి మహిళలు, అంగవైకల్యం కలిగిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. వీరిలో ఎవరూ లేకపోతే జనరల్ మహిళలకు అవకాశం ఉంటుంది. కానీ విలేజ్ హెల్త్ మెడికల్ కమిటీ పేరుతో స్థానిక ఎమ్మెల్యే, స్థానిక నాయకులు చెప్పిన వారికే పోస్టులు కట్టబెడుతున్నారు. ఈ నియామకాల్లో ఒక్కొక్కరి నుండి దాదాపు రూ. 2 లక్షలు నుండి 3 లక్షల రూపాయలు వరకు స్థానిక నాయకులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టుల నియామకాలు పారదర్శకంగా చేపడతామన్న వైద్య ఆరోగ్య శాఖ అధికారుల మాటలు నీటి మీది బుడగల్లా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పాలకుల తీరుపై విసిగి వేశారి...

- గుమ్మడిగెడ్డ కాలువలో స్వచ్ఛందంగా పూడిక తీసుకున్న రైతులు

ప్రజాశక్తి- కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలంలోని గుమ్మడిగెడ్డ కాలువ ద్వారా సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువ పరిధిలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమైనా అధికారులు కనీసం పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టలేదు. గత్యంతరం లేక గోలవలస, గుజ్జుపాడు, చెక్కవలస, పాలెం ఈదరవలస, కర్లగండ, కుంబికోట గ్రామాల రైతులు స్వచ్ఛందంగా కొంత నగదును పోగు చేసుకున్నారు. శనివారం జెసిబి పెట్టుకుని కాలువలో పూడిక తొలగించి, జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఎంతమంది పాలకులు, అధికారులు మారినా తమ గోడు వారికి పట్టలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ కడతామని ఎన్నికల ముందు హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదని, కనీసం కాలువలో పూడిక తీత కూడా చేపట్టకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మించి సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

రణిల్ విక్రమసింఘే ఆసుపత్రికి తరలింపు

కొలంబో : శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింఘేను శనివారం కొలంబో నేషనల్ ఆసుపత్రికి తరలించారు. బ్లడ్ షుగర్ లెవల్, రక్తపోటు స్థాయిలు ఎక్కువగా ఉండడంతో.. అధికారులు జైలు ఆసుపత్రిలో చేర్పించినట్లు జైలు ప్రతినిధి జగత్ వీరసింఘే శనివారం కొలంబోలో తెలిపారు. విక్రమ్‌సింఘే తన పదవీ కాలంలో 16.6 లక్షల రూపాయల నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై శుక్రవారం సిఐడి (క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) ప్రధాన కార్యాలయంలో అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి సిఐడి అధికారులు వాంగ్మూలం నమోదు చేయడానికి విక్రమ్ సింఘేను కార్యాలయాలనికి పిలిపించారు. ఆ తర్వాత ఆయనను అరెస్టు చేశారు. ఈ కేసులో కొలంబో మేజిస్ట్రేట్ కోర్టు ఆయనకు ఈ నెల 26 వరకు రిమాండ్ విధించింది. కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. శుక్రవారం అర్ధరాత్రి ఆయనను మ్యాగజైన్ రిమాండ్ జైలుకు తరలించారు. జైలుకి తరలించిన తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో జైలు అధికారులు ఆసుపత్రికి తరలించారు.

అమెరికా బాధిత కంపెనీలకు రుణం

- సంసిద్ధత తెలిపిన బ్రెజిల్

బ్రసిలియా : అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న కంపెనీలను రుణాల ద్వారా ఆదుకునేందుకు బ్రెజిల్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు బ్రెజిల్ స్టేట్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (బిఎన్‌డిఇఎస్) శుక్రవారం 1.85 బిలియన్ డాలర్ల రుణ సాయాన్ని ప్రకటించింది. సాధారణ నిర్వహణ ఖర్చులు, కొత్త మార్కెట్ల అన్వేషణ నిమిత్తం ఈ రుణాన్ని అందజేస్తారు. బ్రెజిల్ ప్రభుత్వం ఈ నెల ప్రారంభంలో 5.5 బిలియన్ డాలర్ల రుణ సాయాన్ని ప్రకటించగా అందులో భాగంగా ఈ మొత్తాన్ని అందిస్తారు. అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఏ కంపెనీ అయినప్పటికీ ఈ రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

బ్రెజిల్ నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై విధిస్తున్న సుంకాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ నెల ప్రారంభంలో 10 నుంచి 50 శాతానికి పెంచారు. ఈ చర్య కారణంగా కాఫీ, గొడ్డు మాంసం, సముద్ర ఆహారం, వస్త్రాలు, పాదరక్షలు, పండ్లు వంటి పరిశ్రమలు పెద్ద ఎత్తున నష్టపోతాయి. అయితే అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించడానికి తొందరపడబోమని, అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న కంపెనీలకు మద్దతు ఇవ్వడానికే తొలుత ప్రాధాన్యత ఇస్తామని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా ఇప్పటికే స్పష్టం చేశారు. బిఎన్‌డిఇఎస్ ద్వారా రుణ సదుపాయాన్ని కల్పించడంతో పాటు చిన్న కంపెనీలకు కూడా ఆర్థిక మద్దతు అందిస్తామని ఆయన చెప్పారు.

అదానీ హైడ్రో ప్రాజెక్ట్‌కు

అనుమతి ఇచ్చింది బిజెపి కాదా?

- ఆ పార్టీ అధ్యక్షులు మాధవ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం : సిపిఎం

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

పాడేరు ఏజెన్సీ పర్యటనకు వచ్చిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ వామపక్ష పార్టీలను నిలదీయాలని చేసిన వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనరస శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1/70 చట్టాన్ని బిజెపి రద్దు చేస్తుందని ప్రచారం చేస్తున్న వామపక్ష పార్టీలను నిలదీయాలంటూ విమర్శలు చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. 370 ఆర్టికల్‌ను బిజెపి రద్దు చేయలేదా? అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతితోనే హైడ్రో పవర్ ప్రాజెక్టును నిర్మించడానికి అదాని వంటి కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాల భూములు ఏజెన్సీ ప్రాంతంలో కేటాయించడం, 1/70 చట్టాన్ని ధిక్కరించడం కాదా? అని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ కంపెనీలకు అనుమతి లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా విచ్చలవిడిగా కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు వివిధ ప్రాజెక్టుల పేరుతో అప్పగిస్తున్నారని విమర్శించారు.

చట్టం ఉంటూనే నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రద్దయిన జిఒ 3 సందర్భంలో కూడా బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ఉన్నాయని, ఆ తర్వాత కూడా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు.

ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సుమారు కోటి మంది ఆదివాసీల ఉద్యోగ రిజర్వేషన్ రద్దు అయితే, మోడీ ప్రభుత్వం కనీసం పునరుద్ధరణకు ఎటువంటి ప్రయత్నం చేయలేదని ప్రశ్నించారు. వేలాది మంది ఆదివాసీ నిరుద్యోగులు మెగా డిఎస్‌సి టీచర్స్ పోస్టుల కోసం పోరాటం చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.

గిరిజనులకు ప్రత్యామ్నాయంగా భూములివ్వాల్సిందే

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు

పోలవరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, గిరిజనులకు ప్రత్యామ్నాయంగా భూములివ్వాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులు, తహశీల్దారులు, పోలవరం పరిపాలనాధికారుల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు ప్రత్యామ్నా య భూముల సేకరణ, పునరావాసంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. పునరావాస కాలనీలకు ప్రజలను తరలించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటీవల వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించినపుడు పునరావాస కాలనీలకు విద్యుత్తు, మంచినీటి సదుపాయాలు లేవని సంబంధిత ప్రజలు తన దృష్టి తీసుకుని వచ్చారన్నారు. పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇంకా 4500 ఎకరాల భూమిని సమీకరించాల న్నారు. రైతులకు వ్యవసాయం చేయడానికి అనువుగా ఉన్న భూములను సమీకరించాలని సూచించారు. పునరావాస కాలనీలకు దూరంగా రైతులకు భూములు కేటాయిస్తే ప్రయోజనం ఉండదని తెలిపారు. గ్రామాలకు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయానికి భూములను కేటాయించాలని సూచించారు. జీలుగుమిల్లి, బుట్టాయ గూడెం, కుక్కునూరు గ్రామాల్లో భూములు సేకరించాలని ఆదేశించారు. ఇందుకూరుపేట గ్రామానికి స్మశాన వాటికకు భూమిని సేకరించాలన్నారు. ఈ సమావేశంలో పోలవరం పరిపాలనాధికారి వి.అభిషేక్, రంపచోడవరం ఐటిడిఎ పిఒ కె.సింహాచలం, సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్, చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, ప్రత్యేక ఉప కలెక్టర్ అంబేద్కర్, చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని తహశీల్దారులు పాల్గొన్నారు.

అర్జున్-ఇలవేనిల్‌కు మిక్స్‌డ్ టైటిల్

షైమ్‌కెంట్(కజకిస్తాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు మరో పతకం సాధించారు. తాజాగా 10మీ. మిక్స్‌డ్ విభాగంలో అర్జున్ బబుత-ఇలవేనిల్ వలరివాన్ బంగారు పతకాన్ని చేజిక్కించుకున్నారు. శనివారం జరిగిన ఫైనల్లో భారత జంట 17-11 పాయింట్ల తేడాతో చైనాకు చెందిన పెంగ్ షిన్లు-లూ డింకే జంటను చిత్తుచేశారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్-ఇలవేనిల్ 634.0పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి తుది పోరుకు అర్హత సాధించారు. ఇక మెహూలీ ఘోష్-రుద్రాంక్ష్ పాటిల్ 632.0పాయింట్లతో ఫైనల్‌కు చేరినా.. పతక పోటీకి ముందే నిష్క్రమించారు. జూనియర్ మిక్స్‌డ్ విభాగంలో శాంభవి క్షీర్ సాగర్-నరేన్ ప్రణవ్ జంట 16-12 పాయింట్ల తేడాతో చైనాపై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకున్నారు.

సౌదీ సూపర్‌కప్ విజేత అల్ అహ్లి

- షూటౌట్‌లో రొనాల్డో జట్టుకు తప్పని ఓటమి



దుబాయ్: సౌదీ సూపర్ కప్ టైటిల్‌ను అల్ అహ్లి జట్టు కైవసం చేసుకుంది. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్లో స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో సారథ్యం వహించిన అల్ నస్ర్ జట్టుపై పెనాల్టీ షూటౌట్‌లో 5-3గోల్స్ తేడాతో అల్ అహ్లి జట్టు విజయం సాధించింది. అబ్దుల్లా అల్-ఖైబారీ కొట్టిన బంతిని అల్ అహ్లి గోల్ కీపర్ ఎడ్వర్డ్ మెండీ నివారించడంతో ఆ జట్టుకు విజయం ఖాయమైంది. దీంతో అల్ అహ్లి జట్టు 2016 తర్వాత సౌదీ సూపర్ కప్‌ను చేజిక్కించుకుంది. తొలుత రొనాల్డో గోల్ కొట్టి అల్ నస్ట్‌కు 1-0 ఆధిక్యతను అందించగా.. అల్ అహ్లి తరపున రోజర్ ఇబానెజ్ గోల్ చేయడంతో నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 2-2గోల్స్‌తో సమంగా నిలిచాయి. అదనపు సమయంలోనూ ఇరుజట్లు గోల్ చేయలేకపోయాయి. దీంతో ఫలితం కోసం పెనాల్టీ షూటౌట్‌ను నిర్ణయించగా.. అల్ అహ్లి జట్టు విజేతగా నిలిచింది.

లా స్టూడెంట్‌పై గ్యాంగ్ రేప్ కేసులో ఛార్జిషీట్

- నలుగురు నిందితుల పేర్లు నమోదు

కొల్‌కతా : కొల్‌కతా లా కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) విద్యార్థి విభాగం నాయకుడుసహా నలుగురిపై పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. కొల్‌కతాలో పోలీసు ఉన్నతాధికారులు మీడియాతో మాట్లాడుతూ కళాశాల మాజీ విద్యార్థి, స్టాఫ్ మెంబర్ మిశ్రా, విద్యార్థి జాయిబ్ అహ్మద్, ప్రమిత్ ముఖర్జీ, విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు పినాకి బెనర్జీలపై సామూహిక అత్యాచారం, కిడ్నాప్, హాని కలిగించే ఉద్దేశంతో నిర్బంధించడం, సాక్ష్యాలను దాచడం తదితర అభియోగాలపై కేసులు నమోదు చేశామని చెప్పారు. నిందితులపై 658 పేజీల ఛార్జిషీట్‌ను దాఖలు చేసినట్లు తెలిపారు. బాధితురాలు పోలీసులకు చేసిన ఫిర్యాదు ప్రకారం జూన్ 25వ తేదీ రాత్రి సెక్యూరిటీ గార్డు గదిలో ఆమెపై నిందితులు సామూహిక అత్యాచారానికి పాల్పడటంతోపాటు హింసించారు.

శుభ్‌మన్ గిల్‌కు అనారోగ్యం

- అంకిత్‌కు నార్త్‌జోన్ పగ్గాలు




ముంబయి: నార్త్‌జోన్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అనారోగ్యానికి గురి కావడంతో ఆ జట్టు సారథ్య బాధ్యతలు అంకిత్ కుమార్ అందుకున్నాడు. శుభ్‌మన్ అనారోగ్యానికి గురికావడంతో ఈనెలాఖరులో బెంగళూరులో ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీకి అతడు దూరమైనట్లు, శుభ్‌మన్ గిల్ స్థానంలో శుభం రోహిల్లాను ఎంపిక చేసినట్లు, వైస్ కెప్టెన్‌గా ఎంపికైన అంకిత్ కుమార్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తున్నట్లు నార్త్‌జోన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒకవేళ గిల్ ఫిట్‌నెస్ సాధించినా తొలి మ్యాచ్ మాత్రమే ఆడతాడే. ఆ తర్వాత ఆసియాకప్‌కు పయనం కావాల్సి ఉంది. క్వార్టర్‌ఫైనల్లో నార్త్‌జోన్ జట్టు ఈస్ట్‌జోన్‌తో తలపడనున్న విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ 754పరుగులు చేసి ఆసియాకప్ టి20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. అలాగే టీమిండియాకు వైస్ కెప్టెన్‌గానూ ఎంపికయ్యాడు. దులీప్ ట్రోఫీ ఈనెల 28నుంచి సెప్టెంబర్ 15వరకు జరగనుంది. ఆసియాకప్ సెప్టెంబర్ 9నుంచి యుఎఇ వేదికగా జరగనుండగా.. ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆసియా కప్ బరిలో ఇదిగే ఛాన్స్ ఉంది.

ఒక్క ఇల్లు కట్టలేదు!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌ఎలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను సైతం ఇళ్ల నిర్మాణం కోసం జనం నిలదీస్తున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ సామాన్య ప్రజానీకం సొంతింటి కలకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు వేయని పరిస్థితి. దీంతో ఇంటి నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ఇంటి నిర్మాణం కోసం 30,800 దరఖాస్తులు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 7,612 దరఖాస్తులు గృహనిర్మాణ శాఖకు చేరాయి. కొత్త ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండాపోయింది. దీంతో దరఖాస్తులన్నీ అలానే ఉండిపోయాయి. కొత్త ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తామని చెప్పడం తప్ప ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంజూరు ప్రక్రియ లేకుండాపోయింది. దీంతో ఎంతోమంది సామాన్య ప్రజానీకం ఇంటి నిర్మాణం కోసం పడిగాపులు పడుతున్న పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకుని ఇంకా నిరీక్షించలేక అప్పులు తెచ్చి ఇంటి నిర్మాణం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం ఏలూరు జిల్లాలో లక్షా రెండు వేల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. గడిచిన ఐదేళ్లతోపాటు ఇప్పటి వరకూ జరిగిన ఇళ్ల నిర్మాణం 60 వేలు వరకూ ఉన్నాయి. ఇంకా 40 వేలకుపైగా ఇళ్ల నిర్మాణం జరగలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో గత ప్రభుత్వంలో 73,792 ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా ఇప్పటి వరకూ 35,784 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 38 వేల ఇళ్ల నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం వీటికి సంబంధించిన పనులు మాత్రమే సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి రోజులు గడిచిపోతున్నా కొత్త దరఖాస్తులకు మాత్రం మోక్షం కలగడం లేదు. దీంతో కొత్త ఇంటిని నిర్మించుకోవాలన్న కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



'మిరాయ్' మేకింగ్ వీడియో

తేజ సజ్జ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మిరాయ్' చిత్రం నుండి తాజాగా మేకింగ్ వీడియో విడుదలైంది. ఈ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జీ. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. మంచు మనోజ్, శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం తేజ సజ్జా బర్త్‌డే కానుకగా ఈ మేకింగ్ వీడియోను విడుదల చేశారు.



'సుందరకాండ'ను ఆదరించండి

నారా రోహిత్

'కుటుంబ సమేతంగా వినోదాన్ని ఆస్వాదించేలా రూపొందిన చిత్రమే 'సుందరకాండ'. అన్ని తరగతుల ప్రేక్షకులకు నచ్చేలా పలు అంశాలు ఉంటాయి. మానవీయ విలువలు పెంచేలా మా సినిమా ఉంటుంది. కుటుంబ సభ్యులంతా థియేటర్లో హాయిగా కూర్చుని చూసే సినిమా ఇది. ఈనెల 27న వినాయకచవితి పండుగ సందర్భంగా విడుదల చేస్తున్నాం. దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి చాలా బాగా తెరకెక్కించారు. కథానాయికలు శ్రీదేవి విజయ్‌కుమార్, విర్తి వాఘాని మంచి ప్రతిభ కనబర్చారు. మిగతా క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా బాగా చేశారు. మొత్తంగా అన్ని ఎలిమెంట్లతో మంచి కుటుంబ ప్రేమకథా చిత్రంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులు ఆదరించి విజయాన్ని చేకూర్చాలని కోరుతున్నా' అని కథానాయకుడు నారా రోహిత్ కోరారు. సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారంనాడు రాజమహేంద్రవరం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. వెంకటేష్ నిమ్మలపూడి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించారు. నరేష్, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.



వారం ముందుగానే 'లిటిల్ హార్ట్స్'

మౌళి తనుజ్ నటించిన 'లిటిల్ హార్ట్స్' చిత్రం ముందు ప్రకటించిన తేదీ కంటే ఓ వారం ముందే జనం ముందుకు రానుంది. మొదట సెప్టెంబరు 12న ఈ చిత్రాన్ని విడుదలచేస్తామని ప్రకటించారు. తాజాగా సెప్టెంబరు 5 విడుదల తేదీతో ఓ పోస్టర్ రిలీజ్ చేసి కొత్త తేదీ ప్రకటించారు. 'నైన్టీస్ మిడిల్ క్లాస్ బయోపిక్'లో నటించిన మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'లో హీరోయిన్‌గా నటించిన శివానీ నాగారం ఈ సినిమాలో లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌లో సాయి మార్తాండ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'నైన్టీస్ మిడిల్ క్లాస్ బయోపిక్' దర్శకుడు ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మౌళి తనుజ్, రాజీవ్ కనకాల తండ్రీ కొడుకులుగా నటిస్తున్న ఈ సినిమాను బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు.

జయకృష్ణ హీరోయిన్‌గా రాషా!



బాలీవుడ్ నటి రవీనా టాండన్ కూతురు రాషా, ఘట్టమనేని జయకృష్ణ పక్కన హీరోయిన్‌గా నటిస్తోందని తెలుస్తోంది. అజయ్ భూపతి రూపొందిస్తున్న ఈ సినిమాలో ఆమెనే హీరోయిన్‌గా తీసుకోవాలని చర్చలు జరిగాయని సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్ 15 నుంచి ప్రారంభంకానుందని వార్తలు వస్తున్నాయి.



సెకండ్ షెడ్యూల్‌లో 'చౌదరి గారి అమ్మాయి'

వినయ్ తేజ్, రిషిత తొలి పరిచయంగా తెరకెక్కుతున్న సినిమా 'చౌదరిగారి అమ్మాయి'. ఎడ్‌కాన్ ఫ్లస్ సంస్థ నిర్మాణ సారథ్యంలో దర్శకుడు సిద్ధు వర్మ కాకాని తెరకెక్కిస్తున్నారు. సెకండ్ షెడ్యూల్ గత కొన్నిరోజులుగా విజయవాడ, మంగళగిరి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతోంది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆదిత్య ప్రదీప్, డిఒపి మహేష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. పలువురు క్యారెక్టర్ ఆర్టిస్టులు షూట్‌లో పాల్గొంటున్నారు.

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-4

విజేత తుంగభద్ర వారియర్స్

- ఫైనల్లో అమరావతి రాయల్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలుపు
- అర్ధసెంచరీలతో మెరిసిన రోహిత్, జ్ఞానేశ్వర్



విశాఖపట్నం: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-2025 విజేతగా తుంగభద్ర వారియర్స్ జట్టు నిలిచింది. ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో శనివారం జరిగిన ఫైనల్లో తుంగభద్ర జట్టు ఐదు వికెట్ల తేడాతో అమరావతి రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. అమరావతి రాయల్స్ నిర్దేశించిన 195పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తుంగభద్ర జట్టు 18 ఓవర్లలో కేవలం ఐదు వికెట్లు కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. జ్ఞానేశ్వర్(66), గుత్త రోహిత్(63) అర్ధసెంచరీలతో రాణించి జట్టు తొలిసారి టైటిల్ చేజిక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించారు. అలాగే లీగ్ దశలో అమరావతి రాయల్స్ చేతిలో ఓడిన పరాభవానికి తుంగభద్ర జట్టు బదులు తీర్చుకుంది. అలాగే తొలిసారి ఎపిఎల్ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. ఛేదనలో భాగంగా తుంగభద్ర కెప్టెన్(3) నిరాశపరిచినా.. జ్ఞానేశ్వర్(66; 45బంతుల్లో 8ఫోర్లు, 2 సిక్సర్లు), రోహిత్(63; 28బంతుల్లో 3ఫోర్లు, 7సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసారు. చివర్లో దత్తరెడ్డి(25; 12బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్), ఆనంద్(14నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అమరావతి రాయల్స్‌కు అదిరే ఆరంభం లభించింది. కెప్టెన్ హనుమ విహారి(51) అర్ధసెంచరీకి తోడు ప్రణీత్(47) రాణించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 6 ఓవర్లలో 70పరుగులు జతచేశారు. ఆ తర్వాత వెంకట రాహుల్(17), ప్రసాద్(6), వినయ్ కుమార్(17), సందీప్(13) నిరాశపరిచారు. చివర్లో పాండురంగ(22; 14 బంతుల్లో ఫోర్, 2సిక్సర్లు), అయ్యప్ప(10నాటౌట్; 3బంతుల్లో ఫోర్, సిక్సర్)తో మెరిసారు. దీంతో అమరావతి రాయల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 7వికెట్ల నష్టానికి 194పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. తుంగభద్ర బౌలర్లు శశికాంత్‌కు మూడు, స్టెఫెన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

అమరావతి రాయల్స్ ఇన్నింగ్స్: విహారి (సి)సౌరభ్ కుమార్ (బి)శశికాంత్ 51, ప్రణీత్ (బి)స్టెఫెన్ 47, వెంకట రాహుల్ (సి)దీపక్ (బి)శశికాంత్ 17, ప్రసాద్ (రిటైర్డ్ ఔట్) 17, సందీప్ (సి)దత్తరెడ్డి (బి)స్టెఫెన్ 13, పాండురంగ (సి)ఆనంద్ జోసయ్ (బి)శశికాంత్ 22, కరణ్ షిండే (నాటౌట్) 6, అయ్యప్ప (నాటౌట్) 10, అదనం 5. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 194పరుగులు. **వికెట్ల పతనం:** 1/70, 2/103, 3/122, 4/128, 5/165, 6/184 **బౌలింగ్:** స్టెఫెన్ 4-0-43-2, సౌరభ్ కుమార్ 2-0-27-0, తోషిత్ యాదవ్ 2-0-20-0, శశికాంత్ 4-0-37-3, దీపక్ 4-0-44-0, సిద్ధార్థ్ 4-0-20-1.

తుంగభద్ర వారియర్స్ ఇన్నింగ్స్: ముషీర్ కుమార్ (సి)వినయ్ కుమార్ (బి)అయ్యప్ప 3, జ్ఞానేశ్వర్ (సి)వినయ్ కుమార్ (బి)అయ్యప్ప 66, జి. రోహిత్ (సి)వినయ్ కుమార్ (బి)విహారి 63, ప్రశాంత్ కుమార్ (సి)వెంకట రాహుల్ (బి)వినయ్ కుమార్ 12, దత్తరెడ్డి (సి)పాండురంగ (బి)విహారి 25, ఆనంద్ జోసయ్య (నాటౌట్) 14, శశికాంత్ (నాటౌట్) 7, అదనం 5. (18 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 195పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/108, 3/137, 4/157, 5/188 **బౌలింగ్:** మల్లికార్జున 2-0-19-0, అయ్యప్ప 3-0-44-2, సంతోష్ 4-0-44-0, వినయ్ 4-0-34-1, విహారి 4-0-42-2, కార్తిక్ 1-0-12-0.

నార్త్ ఈస్ట్ యునైటెడ్‌దే డ్యురండ్ కప్

ఫైనల్లో డైమండ్ హార్బర్‌పై గెలుపు



కోల్‌కతా: డ్యురండ్ కప్ టైటిల్‌ను నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టు సాధించింది. సాల్ట్‌లేక్ స్టేడియంలో శనివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టు 6-1 గోల్స్ తేడాతో డైమండ్ హార్బర్ జట్టును చిత్తుచేసింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన నార్త్ ఈస్ట్ జట్టు తరపున అషీర్ అక్తర్, పార్థిబ్ గొగోయ్, థోయ్‌సింగ్, జైరో, గైతాన్, అలాయెద్దెన్ అజారై గోల్స్ చేశారు. మ్యాచ్ ప్రారంభం నుంచి నార్త్ ఈస్ట్ జట్టు ప్రత్యర్థి జట్టుపై ఆధిక్యతను ప్రదర్శించింది. గ్రూప్ టాపర్‌గా నిలిచిన నార్త్ జట్టు అదే ఫామ్‌ను ఫైనల్లోనూ కనబర్చింది. మొరాకో స్ట్రయికర్ అలాయెద్దిన్ అజారై ఏడు గోల్స్‌తో టాపర్‌గా నిలిచాడు. క్వార్టర్‌ఫైనల్లో బోడోలాండ్ ఎఫ్‌సిపై 4-0తో, సెమీస్‌లో షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సిపై పోరాడి విజయం సాధించి టైటిల్ పోరుకు సిద్ధమయ్యారు. ఇక డైమండ్ హార్బర్ ఎఫ్‌సి జట్టు క్వార్టర్‌ఫైనల్లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సిపై 2-0తో, సెమీఫైనల్లో పటిష్ట కోల్‌కతా జెయింట్స్ ఈస్ట్‌బెంగాల్ ఎఫ్‌సిపై 2-1గోల్స్‌తో విజయం సాధించి ఫైనల్‌కు చేరారు. ఆసియాఖండంలోనే అతి పురాతనమైన, దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఇది.

ప్రైజ్‌మనీ వివరాలు...

గోల్డెన్ గ్లౌ	: గుర్మీత్ సింగ్
గోల్డెన్ బాల్, బూట్	: అలాయొద్దిన్ అజారై(7గోల్స్)
టైటిల్ విజేత	: రూ. 1.21కోట్లు
రన్నరప్ జట్టు	: రూ. 60లక్షలు
సెమీఫైనల్లో ఓడిన ఒక్కో జట్టుకు	: రూ. 25లక్షలు
క్వార్టర్‌ఫైనల్లో ఓడిన ఒక్కో జట్టుకు	: రూ. 15లక్షలు

గోల్డెన్ గ్లౌ, గ్లోల్డెన్ బాల్, గోల్డెన్ బూట్ విజేతలకు ఒక్కొక్కరికి రూ. 3లక్షలతోపాటు మహింద్రా XUV 3OO SUV కారు అందజేస్తారు.

జార్ఖండ్‌లో వర్షాలకు ఐదుగురు మృతి

రాంచీ : జార్ఖండ్‌లో కురిసిన భారీ వర్షాలకు వివిధ ప్రాంతాల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, ఒకరు గల్లంతయ్యారు. పలువురు గాయపడ్డారని శనివారం అధికారులు తెలిపారు. సెరైకెల్లా ఖర్సవాన్ జిల్లాలో వర్షానికి ఇల్లు కూలి ఓ మహిళ, ఆమె కుమారుడు మృతి చెందారు. రాజ్‌నగర్ బ్లాక్‌లోని దండు గ్రామంలో జరిగిన మరో సంఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

మరో సంఘటనలో ఇల్లు కూలి మహిళ, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడడంతో.. వారిని జంషెడ్‌పూర్‌లోని ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. వారిద్దరూ అక్కడ చికిత్స పొందుతూ మరణించారు.

ఖరస్వాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కోల్ షిమ్లాలో శనివారం ఇల్లు కూలి ఓ ఐదేళ్ల చిన్నారి చనిపోగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారంనాడు ఛత్రా జిల్లా కట్టారాలో ఉప్పొంగుతున్న నదిలో భార్యాభర్తలు కొట్టుకుపోయారు. భర్త మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, భార్య గల్లంతైందని గిధౌర్ బిడివో (బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) రాహుల్ దేవ్ మీడియాకు వెల్లడించారు.

అంతరిక్ష సాంకేతికత పాలనలో ఒక భాగం : మోడీ

న్యూఢిల్లీ : భారతదేశ పాలనలో అంతరిక్ష సాంకేతికత ఏకీకరణ పెరుగుతోందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. పంటల బీమా, విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక రంగాలపై సాంకేతికత ప్రభావం అధికంగా ఉంటోందని ఆయన చెప్పారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో శనివారం జరిగిన కార్యక్రమంలో మోడీ ప్రసంగించారు. అంతరిక్షంలో భారతదేశం సాధించిన పురోగతి సాధారణ పౌరుల జీవితాలను సులభతరం చేస్తోందని చెప్పారు. ఇప్పుడు భారతదేశం నుండి ప్రతి సంవత్సరం ఐదు పెద్ద ప్రయోగాలను చూస్తున్నామని, రాబోయే ఐదేళ్లలో ఏటా 50 రాకెట్‌లను ప్రయోగించగల దశకు చేరుకోవాలని అన్నారు. ఇందుకోసం ప్రైవేటురంగం కూడా ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అధిపతి వి. నారాయణన్ తదితరులు మాట్లాడారు.

ధర్మస్థల కేసులో ఆరోపణలు చేసిన పారిశుధ్య కార్మికుడు అరెస్టు

ధర్మస్థల (కర్నాటక) : ధర్మస్థలలో యువతులపై అత్యాచారాలు, హత్యలు జరిగాయని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసిన కార్మికుడిని కర్ణాటక పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు శనివారం అరెస్టు చేశారు. పారిశుధ్య కార్మికుడిని సిట్ చీఫ్ ప్రణబ్ మొహంతి శనివారం ప్రశ్నించారు. తప్పుడు సమాచారం, నకిలీ ఆధారాలు అందించాడని ఆరోపిస్తూ కార్మికుడిని సిట్ అరెస్టు చేసింది.

వాంగ్మూలానికి, ఆధారాలకు తేడా

ఇచ్చిన వాంగ్మూలాలు, అందించిన పత్రాలలో వ్యత్యాసాలు కనిపించిన తర్వాత పారిశుధ్య కార్మికుడిని అధికారులు అరెస్టు చేసినట్లు జాతీయ మీడియా నివేదికలు తెలిపాయి. 1995 – 2014 మధ్య అత్యాచారానికి, దారుణ హత్యకు గురైన సుమారు 100 మంది మతదేహాలను బెదిరింపులకు లొంగి ధర్మస్థలంలోని వివిధ ప్రాంతాలలో ఖననం చేశానని మాజీ పారిశుధ్య కార్మికుడు ధర్మస్థల పోలీస్ స్టేషన్‌లో జులై 3న ఫిర్యాదు చేశాడు. సమగ్ర దర్యాప్తు తర్వాత, జులై 11న మేజిస్ట్రేట్ ముందు హాజరై, తన వాంగ్మూలాన్ని నమోదు చేశాడు. అస్థిపంజర అవశేషాలను కూడా అప్పగించాడు, తానే వాటిని తవ్వానని పేర్కొన్నాడు. గంటల తరబడి అధికారులు ప్రశ్నించిన తర్వాత, పారిశుధ్య కార్మికుడిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. అతని అరెస్టును నమోదు చేశారు. ధర్మస్థలంలో అనేక మతదేహాలను రహస్యంగా ఖననం చేశారని పారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసింది. పరిశోధకులు ఇప్పటివరకు 17 వేర్వేరు ప్రదేశాలలో తవ్వకాలు జరిపారు. వీటిలో, ఒక చెట్టు కింద నుండి మాత్రమే అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్‌పై కేసు

- కేసులకు భయపడం, నిజాలే మాట్లాడతాం : తేజస్వి

పాట్నా : బీహార్ మాజీ డిప్యూటీ సిఎం తేజస్వి యాదవ్‌పై మహారాష్ట్రలోని గడ్జిరోలి జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాని నరేంద్రమోడీ బీహార్‌లోని గయా పర్యటనకు ముందు తేజస్వి యాదవ్ ఎక్స్‌లో పెట్టిన పోస్టు అభ్యంతరకరంగా ఉందంటూ గడ్చిరోలి బిజెపి ఎమ్మెల్యే మిలింద్ నరోటే ఫిర్యాదు చేసినట్లు సీనియార్ పోలీసు అధికారి తెలిపారు.

భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 196 (వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, 356 (పరువు నష్టం), 352 (ఉద్దేశపూర్వకంగా అవమానించడం), 353 (ప్రజలకు హాని కలిగించే ప్రకటనలు చేయడం) వంటి సెక్షన్ల కింద తేజస్వియాదవ్‌పై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదుపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, తాను ఎఫ్‌ఐఆర్‌లకు భయపడనని తేజస్వియాదవ్ చెప్పారు. 'ఎఫ్‌ఐఆర్‌కి ఎవరు భయపడతారు? జుమ్లా అనే పదం చెప్పడం కూడా నేరంగా మారింది. బిజెపి నేతలు సత్యానికి భయపడతారు. మేము ఏ ఎఫ్‌ఐఆర్‌కి భయపడం. నిజాలే మాట్లాడతాం' అని బదులిచ్చారు.

కేంద్రం సంకుచిత రాజకీయాలు

- రాష్ట్రాలకు నిధులను నిరాకరిస్తున్నారు
- జాతీయ సెమినార్‌లో తమిళనాడు సిఎం స్టాలిన్



జాతీయ సెమినార్ ప్రారంభోత్సవంలో జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు

చెన్నై : కేంద్రం సంకుచిత రాజకీయాలకు పాల్పడుతూ, రాష్ట్రాలకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నిధులను ఇచ్చేందుకు నిరాకరిస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు. చెన్నైలో కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై శనివారం నిర్వహించిన జాతీయ సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యధికంగా జిఎస్‌టి ఆదాయం అందిస్తున్న రాష్ట్రాల్లో తమిళనాడు ఒకటని చెప్పారు. అయినప్పటికీ కేంద్రం సంకుచిత రాజకీయ ఉద్దేశాలతో తమిళనాడుకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నిధుల వాటాను ఇచ్చేందుకు నిరాకరిస్తోందన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు బిజెపి పాలనలో లేకపోవడంతో కేంద్రం పలు సమస్యలు, ఇబ్బందులు సృష్టిస్తోందని విమర్శించారు. 1967లో రాష్ట్రాల హక్కులను కాపాడుకోవడానికి రాజ్యాంగ సమీక్ష కోసం మాజీ ముఖ్యమంత్రి సి.ఎన్. అన్నాదురై డిమాండ్ చేశారని చెప్పారు. 1969లో కేంద్ర–రాష్ట్ర సంబంధాలను పరిశీలించడానికి జస్టిస్ రాజమన్నార్ కమిటీని ఏర్పాటు చేయడంలో మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. 1983లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్కారియా కమిషన్, అధిక కేంద్రీకరణ ప్రమాదాలను ఎత్తి చూపినప్పటికీ, రాష్ట్రాలకు అధికారం కల్పించడానికి అర్థవంతమైన రాజ్యాంగ సవరణలను సిఫార్సు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. "అప్పటి నుండి, వరుస సవరణలు, చట్టాలు కేంద్రానికి మరిన్ని అధికారాలను మాత్రమే ఇచ్చాయి" అని స్టాలిన్ చెప్పారు. "2007లో, డిఎంకె పట్టుబట్టడంతో, యుపిఎ ప్రభుత్వం పుంఛి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. గవర్నర్‌లను సంబంధిత ముఖ్యమంత్రులతో సంప్రదించి, నిష్పక్షపాతంగా నియమించాలని దాని ముఖ్య సిఫార్సు. అయినప్పటికీ ఇది ఎప్పుడూ అమలు కాలేదు, ప్రస్తుత తమిళనాడు గవర్నర్ చర్యల వల్ల ఆ సిఫార్సు ప్రాధాన్యత స్పష్టంగా తెలుస్తుంది," అని ఆయన అన్నారు. అనేక శాసన, పరిపాలనా జోక్యాల ద్వారా, కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను ఇబ్బంది పెడుతూనే ఉందన్నారు. ఇది ఆర్థిక కమిషన్ల స్వాతంత్ర్యాన్ని కూడా దెబ్బతీస్తుందని, రాష్ట్రాలకు వారి హక్కుగా రావాల్సిన ఆదాయం వాటాను నిరాకరిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం హిందీని ప్రోత్సహిస్తోందని, తమిళనాడు అటువంటి ప్రయత్నాలను విజయవంతంగా ప్రతిఘటించిందని, ద్విభాషా విధానం చెక్కుచెదరకుండా ఉండేలా చూసుకుందని ,ఉచెప్పారు. రాష్ట్రాల స్వావలంబన ద్వారానే భారతదేశం బలంగా ఎదుగుతుందని, జాతీయ ఐక్యత గురించి శ్రద్ధ వహించేవారంతా తమతో గొంతు కలపాలని అన్నారు. తమిళనాడు మాదిరిగానే, ఇతర రాష్ట్రాలు కూడా హక్కులు, సమాఖ్యవాదం కోసం డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ఇలాంటి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ, నిజమైన సమాఖ్య వ్యవస్థ కోసం ఇతర రాష్ట్రాలతో చర్చించాలని స్టాలిన్‌కు సూచించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై ఉన్నత స్థాయి కమిటీ ఛైర్మన్ జస్టిస్ కురియన్ జోసెఫ్ మాట్లాడుతూ, చాలామంది నాయకులు 'దేశం ముందు' అని చెబుతున్నారని, వాస్తవానికి అది 'రాజ్యాంగం ముందు' అని అన్నారు. తొలుత ఉన్నత స్థాయి కమిటీ అధికారిక వెబ్‌సైట్‌ను స్టాలిన్ ప్రారంభించి, దేశవ్యాప్తంగా ప్రజలు తమ అభిప్రాయాలను పంచుకోవడానికి వీలుగా ఆన్‌లైన్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు.

యుజిసి ముసాయిదా పాఠ్య ప్రణాళిక అశాస్త్రీయం

- 27న దేశవ్యాప్తంగా నిరసనలు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ముసాయిదా పాఠ్య ప్రణాళిక అశాస్త్రీయమైనదని ఎస్‌ఎఫ్‌ఐ విమర్శించింది. యుజిసి ఇటీవల తొమ్మిది సబ్జెక్టులకు విడుదల చేసిన అభ్యాస ఫలితాల ఆధారిత పాఠ్య ప్రణాళిక ముసాయిదా (ఎల్‌ఒసిఎఫ్) ముసాయిదాను ఆదిమ కాలం నాటిదిగా, అశాస్త్రీయంగా ఉందని పేర్కొంది. ఈ ముసాయిదాకు వ్యతిరేకంగా ఈ నెల 27న దేశవ్యాప్తంగా యుజిసి కార్యాలయాలు, ప్రాంతీయ కేంద్రాల వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదర్శ్ ఎం సాజి, శ్రీజన్ భట్టాచార్య ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 25, 26 తేదీల్లో క్యాంపస్‌లు, సెంట్రల్, రాష్ట్ర విశ్వవిద్యాలయ కేంద్రాల్లో డ్రాఫ్ట్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాలని, డ్రాఫ్ట్ కాపీలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ముసాయిదాను వ్యతిరేకించాలని వైస్ ఛాన్సలర్లకు డిమాండ్ లేఖలు రాయనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ముసాయిదాపై తమ అభిప్రాయాన్ని ఇవ్వడానికి తక్కువ సమయం ఇచ్చారని విమర్శించారు. రసాయన శాస్త్ర పాఠ్యాంశాలు ప్రారంభంలో సరస్వతి దేవికి నమస్కారం చేయడం దారుణమన్నారు. వాణిజ్య పాఠ్యాంశాల్లో కౌటిల్యుడి అర్థశాస్త్రం బోధించాలని పేర్కొన్నట్లు తెలిపారు. వి.డి. సావర్కర్ రాసిన 'ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్' 'ఇండియన్ స్ట్రగుల్ ఫర్ ఇండిపెండెన్స్'లకు పాఠ్యాంశాల జాబితాలో చోటు కల్పించారని విమర్శించారు. దీంతో విద్య ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(హెచ్) ప్రకారం, శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, సంస్కరణల స్ఫూర్తిని పెంపొందించడం పౌరుల ప్రాథమిక విధి అని, యుజిసి చేసిన ఈ ప్రయత్నం ఉన్నత విద్యలో కాషాయీకరణను తీవ్రతరం చేయడానికి, అశాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయడానికి ఉద్దేశించబడిందని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం గురించిన అభ్యాస జాబితాలో సావర్కర్ పుస్తకాన్ని చేర్చడం విద్యార్థులను స్వాతంత్ర్య పోరాట వాస్తవ చరిత్ర నుంచి తప్పుదారి పట్టించడానికి ఉద్దేశించబడిందని విమర్శించారు. ఈ దేశంలోని విద్యార్థులు, యువత స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్వాతంత్ర్య పోరాటానికి ద్రోహం చేసిన వారు రాసిన పుస్తకాల నుండి అధ్యయనం చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దేశంలో విద్యను నాశనం చేయడానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని విద్యార్థి లోకానికి ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు ఇస్తోందన్నారు. యుజిసి ప్రతిపాదించిన ఈ అశాస్త్రీయ దృక్పథ ప్రచారాన్ని ప్రతిఘటించడానికి ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులను సంఘటితం చేస్తుందన్నారు. స్వాతంత్ర్యోద్యమ వాస్తవ చరిత్ర నుంచి తప్పుదోవపట్టించే విధంగా చేసే ఏ ప్రయత్నానికైనా దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు ఎదురవుతాయని హెచ్చరించారు.

శిథిలావస్థలో ఉన్న 86 వేల తరగతి గదులకు తాళాలు

- రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలు

జైపూర్ : శిథిలావస్థకు చేరుకున్న 86,934 ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులకు తాళాలు వేయాలని రాజస్థాన్ హైకోర్టు ఆదేశించింది. గదులకు తాళాలు వేయాలని, పిల్లలను ఆ పరిసరాల్లోకి అనుమతించవద్దని శుక్రవారం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. గత నెలలో రాజస్థాన్‌లోని ఝలావర్‌లో పాఠశాల భవనం కూలి ఏడుగురు పిల్లలు చనిపోగా, 28 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఆ తరువాత జైసల్మేర్‌లో ఒక పాఠశాల ప్రధాన ద్వారం కూలి ఒక విద్యార్థి మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. రాష్ట్రంలో 63,018 ప్రభుత్వ పాఠశాలల్లోని 5,26,162 తరగతి గదులు ఉన్నాయి. వాటిలో 86,934 పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని ఉపాధ్యాయులు నిర్వహించిన ప్రాథమిక సర్వేలో వెల్లడైంది. 5,667 పాఠశాలలు ఉపయోగించడానికి సురక్షితం కాదని ఆ సర్వేలో తేలింది. 17,109 టాయిలెట్లు శిథిలావస్థకు చేరుకోగా, 29,093 మరమ్మతులు చేయగలిగినవిగా గుర్తించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని న్యాయస్థానం కోరింది. పాఠశాలలకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు ధ్రువీకరించి, నివేదిక అందజేయాలని ఆదేశించింది. సెప్టెంబర్ 4వ తేదీకి వాయిదా వేసింది.

ఉక్రెయిన్‌తో ఒప్పందం కుదుర్చుకోకుంటే ఆంక్షలే

- రష్యాకు ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్ : ఉక్రెయిన్ విషయంలో రెండు వారాల్లో శాంతియుత పరిష్కారం దిశగా పురోగతి కన్పించని పక్షంలో రష్యాపై ఆంక్షలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరించారు. వారం రోజుల క్రితం అలస్కాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమైన తర్వాత కూడా సమస్య పరిష్కారంలో ముందడుగు పడకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 'ఏం చేయాలనే విషయంపై నిర్ణయం తీసుకోబోతున్నాను. అది చాలా ముఖ్యమైన నిర్ణయం. పెద్ద ఎత్తున ఆంక్షలా లేక పెద్ద ఎత్తున సుంకాలా లేక రెండూ విధించాలా లేకుంటే ఇది మీ యుద్ధం... మేము చెప్పేదేమీ లేదని అనాలా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది' అని ట్రంప్ శుక్రవారం చెప్పారు. తనకు, పుతిన్‌కు మధ్య సమావేశం జరగకుండా చూడడానికి రష్యా అన్ని ప్రయత్నాలూ చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. యుద్ధాన్ని ఎలా ఆపాలనే విషయంపై చర్చించేందుకు సమావేశం జరగాల్సి ఉన్నదని జెలెన్‌స్కీ అన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'యుద్ధాన్ని ఆపేయాలని వారు కోరుకోవడం లేదు. అందుకే సమావేశం జరగకుండా చూస్తున్నారు' అని చెప్పారు. సమావేశం అజెండా ఇంకా సిద్ధం కాలేదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గయ్ లవ్రావ్ చెప్పారు. అలస్కా భేటీలో ట్రంప్ ప్రతిపాదించిన అంశాలపై పట్టువిడుపులు ప్రదర్శించడానికి రష్యా సిద్ధంగా ఉన్నదని తెలిపారు. పుతిన్–జెలెన్‌స్కీ మధ్య సమావేశాన్ని ఇంకా ఖరారు చేయలేదని, అజెండాను ఖరారు చేసిన తర్వాత చర్చలకు పుతిన్ సిద్ధంగానే ఉంటారని అన్నారు.

పెంటగాన్ ఇంటెలిజెన్స్ చీఫ్‌కు ఉద్వాసన



డోనాల్డ్ ట్రంప్, జెఫ్రీ క్రూస్

వాషింగ్టన్ : అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయానికి (పెంటగాన్) చెందిన ఇంటెలిజెన్స్ సంస్థ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ జెఫ్రీ క్రూస్‌ను విధుల నుంచి తప్పించారు. ఆయనతో పాటు మరో ఇద్దరు సీనియర్ సైనికాధికారులను కూడా తొలగించారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ వీరిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పెంటగాన్‌లో ప్రక్షాళన చేపట్టాలన్న డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా ఈ ముగ్గురు సీనియర్ సైనికాధికారులకు ఉద్వాసన పలికారు. క్రూస్‌తో పాటు అమెరికా నావల్ రిజర్వ్‌ల అధిపతి, నావల్ స్పెషల్ వార్‌ఫేర్ కమాండ్ కమాండర్ కూడా ఉద్యోగాలు కోల్పోయారు.

ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంపై సెనెట్ సెలక్ట్ కమిటీ (ఇంటెలిజెన్స్) వైస్ ఛైర్మన్, సెనెటర్ మార్క్ వార్నర్ మండిపడ్డారు. ట్రంప్ ప్రభుత్వం దేశ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం కంటే ఇంటెలిజెన్స్‌ను విధేయ విభాగంగా చూస్తోందని, ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని విమర్శించారు. ట్రంప్ విధానాలతో విభేదించే ప్రస్తుత, మాజీ సైనిక, ఇంటెలిజెన్స్, పోలీసు అధికారులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఈ తొలగింపులు కూడా భాగమే. ఏప్రిల్ నెలలో నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ తిమోతీ హాగ్‌ను ట్రంప్ పదవి నుంచి తప్పించారు. శ్వేతసౌధంలోని జాతీయ భద్రతా మండలిలో పనిచేస్తున్న డజను మందికి పైగా సిబ్బందిని కూడా సాగనంపారు. అమెరికా సైనిక నాయకత్వంలో అసాధారణ మార్పులు తలపెట్టిన ట్రంప్ ప్రభుత్వం ఫిబ్రవరిలో కూడా కొందరిని ఉద్యోగాల నుంచి తొలగించింది.

ఇదిలావుండగా అమెరికా వైమానిక దళ అధిపతి కొద్ది రోజుల క్రితం ఓ ప్రకటన చేస్తూ పదవీ విరమణ చేయాలని అనుకుంటున్నానంటూ బాంబు పేల్చారు. ఆయన పదవీకాలం ఇంకా సగం కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. ఇరాన్ అణు స్థావరాలను పూర్తిగా తుడిచి పెట్టాలని ట్రంప్ భావించగా,దానికి విరుద్ధంగా జూన్ 22న జరిపిన దాడుల కారణంగా టెహ్రాన్ అణు కార్యక్రమం కొద్ది నెలలు మాత్రమే వెనుకబడింది. దీనిపై మండిపడిన ట్రంప్ తాజాగా క్రూస్‌పై వేటు వేశారని చెబుతున్నారు. ప్రభుత్వ పరిమాణాన్ని, వ్యయాన్ని తగ్గించుకోవడానికే సైనిక, ఇంటెలిజెన్స్ అధికారుల సంఖ్యను కుదిస్తున్నామని, దౌత్యవేత్తలను కూడా తగ్గిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది.

రాజ్యాంగానికి సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వుందో తెలుసుకోవాలంటే ముందు కుల గణన జరగాల్సిందేనని చెప్పారు.

సోషలిస్టు, సెక్యులర్ పదాలపై

రాజ్యాంగం పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ పదాలను చేర్చడంపై రేగిన వివాదంపై మాట్లాడుతూ, రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆలోచనలను ఆ పదాలు స్పష్టంగా వ్యక్తీకరిస్తాయని చెప్పారు. 'సవరణ జరిగిందనేది నిజమే, అది 42వ సవరణ, అప్పుడే ఎమర్జన్సీ విధించారు. కానీ, ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి, ఆ తర్వాత జనసంఘ్ కూడా భాగస్వామి యైన ప్రభుత్వం దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.' అని అన్నారుగాంధీ, నెహ్రూ, అంబేద్కర్‌లు గొప్ప ప్రజాస్వామ్య వాదులని, రాజ్యాంగంలోని నైతిక విలువలను విశ్వసించే వారని చెప్పారు. వారిని విభజించి, విడివిడిగా చూడటం దేశ ప్రయోజనాలకు మంచిది కాదన్నారు.

ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్‌బరస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రంగంలోకి దిగి సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టింది. రుద్రప్రయాగ నుండి వచ్చిన మరో 50మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. హిమాలయాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తుండడంతో అలకనంద, భాగీరథి నదులు ప్రమాద స్థాయిని దాటి పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆ సమీప ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా వుండాల్సిందిగా అధికారులు హెచ్చరించారు. రాబోయే 48గంటల్లో చమోలీతో సహా పలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు ఆరంజ్, రెడ్ అలర్ట్‌లను వాతావరణ శాఖ జారీ చేసింది.

ఈ నెల 5న క్లౌడ్ బరస్ట్‌తో ఉత్తరకాశీలోని ధరాలీ గ్రామంలో మెరుపు వరదలు సంభవించి, ప్రాణ, ఆస్తి నష్టం చోటు చేసుకుంది. ఆ ఘటన మరవకముందే మరోసారి క్లౌడ్‌బరస్ట్‌తో ఆకస్మికంగా వరద చుట్టుముట్టింది.

కృత్రిమంగా ఏర్పడిన సరస్సు

యమునా నది ప్రవాహానికి అడ్డుగా శిథిలాల కుప్పగా వచ్చి పడడంతో ఉత్తరకాశీ జిల్లాలోని శ్యానాచట్టి ప్రాంతంలో కృత్రిమంగా ఒక సరస్సు ఏర్పడింది. రాత్రి నుండి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ కృత్రిమ సరస్సు నీటి ప్రవాహంతో పట్టణంలోని పలు ఇళ్లు, హోటళ్లు, ఇతర భవనాలు నీట మునిగాయి. యమునోత్రికి వెళ్లే దారిలో ఈ తరాలీ పట్టణం వుండడంతో వందల సంఖ్యలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విపత్తు నిర్వహణా బృందాలు ఆ సరస్సులో నుండి నీరు బయటకు వెళ్లేలా కాలవను తవ్వడంతో నీరు 12 అడుగులకు తగ్గిందని ఉత్తరకాశీ జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్ ఆర్య చెప్పారు. యమునా నదిలో నీటి మట్టాన్ని పర్యవేక్షించేందుకు, కాలవను తవ్వే పనులు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణా బృందాలు, ప్రజా పనుల శాఖ, ఇరిగేషన్ ఇతర శాఖల అధికారులు, కేంద్ర జల కమిషన్ బృందం అందరూ కూడా అక్కడే వున్నారు. రహదారులకు అడ్డంగా పడిపోయిన చెట్లను, ఇతర శిథిలాలను తొలగించే పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

యమునోత్రి, గంగోత్రి జాతీయ రహదారిపై శిథిలాలు

భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడడంతో గంగోత్రి, యమునోత్రి జాతీయ రహదారులు పాక్షికంగా మూసుకుపోయాయి. ఉత్తరకాశీ ప్రాంతంలో కుంభవృష్టి కారణంగా రోడ్లపైకి చెట్లు, రాళ్లురప్పలు, శిథిలాలు పడడంతో రాకపోకలు స్తంభించాయి. అకస్మాత్తుగా చోటు చేసుకున్న విపత్తు పట్ల ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి విచారం వ్యక్తం చేశారు. ఫోన్లో చమోలీ స్థానిక ఎంఎల్‌ఎ, ఇతర ప్రజా ప్రతినిధులతో మాట్లాడిన సిఎం వరదలతో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధికారులందరూ సమన్వయంతో, సహకరించుకుంటూ ప్రజలకు సాయమందించాల్సిందిగా కోరారు.

అచంచలమైన నిబద్ధత

- సురవరం సుధాకరరెడ్డికి సిపిఎం నివాళి

న్యూఢిల్లీ : సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి మృతిపై సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. కార్మిక వర్గం, అణచివేతకు గురైన ప్రజల కోసం తన జీవితాంతం పోరాడిన యోధుడిగా సుధాకరరెడ్డి, న్యాయం, సమానత్వం, సోషలిజం వంటి ఆదర్శాలకు తన జీవితాన్ని అంకితం చేశారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

కర్నూలులో, ఉస్మానియా యూనివర్శిటీలో విద్యార్థి నాయకుడిగా చురుగ్గా పనిచేసిన తొలినాళ్ల నుంచి చారిత్రక యువజన, విద్యార్థి పోరాటాల్లో ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్‌లకు నాయకత్వం వహించినప్పుడు ఆయన, ప్రజాస్వామిక హక్కులు, సామాజిక పరివర్తన వంటి అంశాల పట్ల అచంచలమైన నిబద్ధతను ప్రదర్శించారని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

నల్గొండ నుండి పార్లమెంట్ సభ్యుడిగా రెండు పర్యాయాలు కామ్రేడ్ సురవరం విజయం సాధించారు. తన సమగ్రత, శాసనపరమైన అంతర్ దృష్టి, కార్మికుల హక్కుల నుండి వ్యవసాయ దుస్థితి వరకు అనేక అంశాలపై తన వాదనకు చిట్టచివరి వరకు నిలబడ్డారు. క్షేత్రస్థాయిలో ఆయన అనేక శక్తివంతమైన ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి (2012–2019)గా మతోన్మాదం, నియంతృత్వాలకు వ్యతిరేకంగా సమైక్య కార్యాచరణను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సిపిఐ విశిష్ట నేతల్లో ఒకరిగా వామపక్ష పార్టీలు, శక్తుల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం కోసం ఆయన సాగించిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరికీ, కామ్రేడ్ సురవరం భార్యా పిల్లలకు పొలిట్‌బ్యూరో తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసింది.



సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజా, సిపిఐ నేతలు

వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి – యంత్రాంగం

సురవరం సుధాకరరెడ్డి మృతి పట్ల సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమాలతో సురవరం రాజకీయ ప్రస్థానం ప్రారంభించి సిపిఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంటు సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున సంతాప సందేశం పంపించారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సురవరం మరణం ప్రజాస్వామ్య హక్కులకు తీరని లోటని పేర్కొంటూ సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పార్టీ తరపున ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, పాలకవర్గాలే రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రస్తుత తరుణంలో, మతోన్మాదం పెచ్చరిల్లుతున్న సందర్భంలో సురవరం లాంటి నేతను కోల్పోవడం దేశానికి, వామపక్ష ఉద్యమాలకు, ప్రజాస్వామ్య హక్కులకు తీరని నష్టమని పేర్కొన్నారు. సురవరం మరణం పట్ల మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, పాటూరు రామయ్య ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు.

సిపిఐ నేతల నివాళులు

ప్రజలకు, దేశానికి సురవరం చేసిన సేవలను ఆ పార్టీ నేతలు స్మరించుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతోపాటు పలువురు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, రాష్ట్ర సమితి సభ్యులు... సురవరం చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు.

ఉద్యమాల్లో చురుకైన పాత్ర : సిఐటియు

రాష్ట్రంలో జరిగిన అనేక ప్రజాతంత్ర, కార్మికోద్యమాల్లో సురవరం చురుకైన పాత్ర పోషించారని సిఐటియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో పాలకులు అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఐక్య పోరాటాలు జరగాల్సిన తరుణంలో సురవరం మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మికోద్యమానికి తీవ్ర నష్టమని పేర్కొంటూ సంతాప ప్రకటన విడుదల చేశారు.

అత్యంత సౌమ్యుడు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఒక సామాన్య కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, ఒక జాతీయ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా ఎదగటం సురవరం వ్యక్తిత్వానికి, పనితనానికి నిదర్శనమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కొనియాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

బ్యాట్ దొంగతనానికి వచ్చి హత్య

- కూకట్‌పల్లి హత్య కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో సంచలనం సృష్టించిన బాలిక సహస్ర హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇంటి పక్క బాలుడే హత్య చేసినట్టు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి శనివారం మీడియాకు వెల్లడించారు. కూకట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఈనెల 18న తల్లిదండ్రులు పనికెళ్లగా.. ఇంట్లో ఒంటరిగా ఉన్న పదేండ్ల బాలిక సహస్ర మధ్యాహ్నం హత్యకు గురయ్యారు. చుట్టుపక్కల వారే ఈ హత్యకు పాల్పడి ఉంటారని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో బాలిక ఇంటి పక్కనే ఉండే ఓ బాలుడిపై అనుమానంతో విచారించగా.. తెలివిగా సమాధానాలు చెప్పి తప్పించుకున్నాడు. అనుమనితులందరినీ విచారిస్తున్న క్రమంలో ఆ బాలుడి ముఖ కవళికలపైనే అనుమానం రావడంతో మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. ఈసారి గట్టిగా విచారించగా.. బాలికను హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : తల్లిదండ్రులు

తమ బిడ్డను చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట మృతురాలు తల్లిదండ్రులు రేణుక, కృష్ణ, బంధువులు శనివారం ధర్నాకు దిగారు. సహస్ర కుటుంబ సభ్యులను తెలంగాణ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సహస్రను అతి కిరాతకంగా చంపిన నిందితునికి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుని.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను కోరినట్టు చెప్పారు. మరోసారి ఇలాంటి నేరాలు జరగకుండా సహస్ర పేరుతో ప్రత్యేక చట్టం తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

స్వర్ణాంధ్ర కావాలంటే... ఆలోచనా విధానం మారాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నామన్నారు. అన్ని వ్యవస్థలనూ ప్రక్షాళన చేస్తూ మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను, మ్యాజిక్ డ్రెయిన్లను చంద్రబాబు పరిశీలించారు. వాటి నిర్మాణం, ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. రీ–సైక్లింగులో భాగంగా చేపడుతున్న ఉత్పత్తుల గురించి ఆరా తీశారు. సముద్రపు నాచుతో చేసే ఉత్పత్తుల స్టాల్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. సముద్రపు నాచుతో మహిళలకు ఉపాధి కల్పించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎంపీలు ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష–బాబు, పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవన సౌరభం


లక్ష్యం ఏర్పర్చుకోవడానికి సందర్భం అంటూ ఏమీ అవసరం లేదు. సంకల్పం ఉంటే చాలు.

మీ కోసం

రోల్డ్ గోల్డ్ నగలు పెట్టుకునేటప్పుడు వాటి వెనకభాగంలో ట్రాన్స్‌పరెంట్ గోళ్ల రంగు పూస్తే.. దురద, మంట రాదు.



మట్టి విగ్రహాలే మేలు



'ఏంటి రాము!చాలా వేగంగా పరుగెత్తుకొస్తున్నావు'. 'నాన్న, నాకు ఓ వంద రూపాయలు కావాలి'. 'వంద రూపాయలు ఎందుకు రాము?'

'ఏమి లేదు నాన్న.. వినాయక చవితి వస్తుంది కదా. మా స్నేహితులు అంతా రంగు రంగుల వినాయకుడి బొమ్మలు కొనుక్కుంటున్నారు. అవి చూడటానికి చాలా బావున్నాయి. నేను కూడా ఒక బొమ్మ కొనుక్కుంటా నాన్న.

'చూడు రాము! అవి చూడటానికి మాత్రమే బావుంటాయి. వాటిల్లో అనేక రసాయనాలు కలుపుతారు. ఆ బొమ్మలను నీళ్లలో కలిపితే నీటి కాలుష్యం ఏర్పడుతుంది'.

'అవునా నాన్న! నాకు తెలియదు. మరి పెద్ద పెద్ద బొమ్మలని కూడా తయారు చేస్తున్నారు కదా'.

'అవును రాము, వాటిని ఎక్కువగా ప్లాస్టర్ అఫ్ పారిస్‌తో తయారు చేస్తారు. అవి త్వరగా నీటిలో కరగవు. వాటి వల్ల నీటి కాలుష్యం పెరుగుతుంది. మా చిన్నప్పుడు మట్టి బొమ్మలు మాత్రమే ఉపయోగించేవాళ్ళం. అదే విధంగా సహజ సిద్ధమైన రంగులు ఉపయోగించే వాళ్ళం'. 'అవునా నాన్న.. అయితే నేను కూడా మట్టి బొమ్మనే ఉపయోగిస్తా. ఇదే విషయాన్ని మా స్నేహితులకు కూడా చెప్తా'.

యం. రాం ప్రదీప్,
జెవివి సభ్యులు, తిరువూరు, 94927 12836.

బడి



బడి మా బడి
ఇది ప్రభుత్వ బడి
బడిలోనే చదువుకుంటాం
బడిలోనే ఆడుకుంటాం
బడిలోనే స్నేహితులతో
కమ్మని కబుర్లు చెప్పుకుంటాం

మా టీచర్లు అమ్మ ప్రేమను
పంచుతారు
మేము బాగా చదువుకుంటే
వాళ్లంతా ఆనందంగా
గడుపుతారు
ఈ బడిని మేము ఎన్నటికీ
మరచిపోము
మా బడి చదువులమ్మ ఒడి

మాకు చదువు నేర్పిన బడికి
మేము రుణపడుతాము
కష్టాలన్నీ మరిచిపోయి
కమ్మని కథలు చెబుతాము
అక్కా, చెల్లి అనుకుంటూ
ఆనందంగా గడుపుతాము
మా బడి మమ్మల్ని కాపాడే
అమ్మ ఒడి



- రాయనపాటి శృతి, 8వ తరగతి, పీఎంశ్రీ జెడ్ పి హెచ్ ఎస్ కోదాడ, సూర్యాపేట.

నేను గీసిన బొమ్మ



బి.ధనుశ్రీ
8వ తరగతి,
జెడ్‌పిహెచ్ స్కూలు,
యడమర్రి, చిత్తూరుజిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లల ప్రేమికుడు .. విద్యా నిపుణుడు

పిల్లలకు తగ్గట్టుగా మనం ఎలా ఎదగాలి? పిల్లలకు తగ్గట్టుగా ఎలా చదువు చెప్పాలి? పిల్లలను శారీరకంగా, మానసికంగా ఎలా ఎదగనీయాలి? చదువులైనా, సంగీత సాహిత్యాలైనా సమాజానికి ఎలా ఉపయోగపడాలి? ... ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలను అన్వేషిస్తూ, ఆ అన్వేషణనే ఆచరిస్తూ తన యావత్ జీవితాన్ని ఆదర్శప్రాయంగా గడిపారు మంచిరెడ్డి శివరాం. ఆయన ఏ ప్రచారమూ కోరని విద్యారంగ నిపుణుడు. పిల్లల ప్రేమికుడు. తత్వవేత్త. ఏది చెప్పాడో దానినే జీవితాంతం ఆచరించిన నిరాడంబర జీవి. పిల్లల మనసులలో, శ్రేయోభిలాషుల జ్ఞాపకాల్లో సదా చిరంజీవి.





మంచిరెడ్డి శివరాం తన ఆశయ సాధనకు విద్యారంగమే సరైందని ఎన్నుకున్నారు. ఈ రంగంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. పిల్లలు సృజనాత్మకంగా ఆలోచించాలని, ప్రశ్నించడం చేర్చుకోవాలని, తనకు తానుగా నేర్చుకోవాలని చెప్పుండేవారు. సృజనాత్మక విద్య, విద్యారంగ అభివృద్ధిని కాంక్షిస్తూ పాటల ద్వారా కూడా ప్రచారం చేసేవారు. అకడమిక్ సబ్జెక్టుల ద్వారానే కాకుండా ఆట, పాట, చిత్రలేఖనం, హస్తకళల ద్వారా విద్యార్థులు తమను తాము ఎవరూ ఎవరికీ పోటీ కాకుండా, ఎవరికి వారుగా అభివ్యక్తీకరించుకునేందుకు అవకాశం కల్పించడమే స్కూలు, తల్లిదండ్రుల బాధ్యతని నొక్కి చెప్పేవారు. చదువు పేరిట పిల్లలు ఏ విధంగా హింసకు గురవుతూ సహజ శక్తులను కోల్పోతున్నారో తన ప్రసంగాల్లో ఆవిష్కరించేవారు. వ్యక్తి వికాసం వెదజల్లే ప్రేమ పూర్వకమైన ప్రజ్ఞ ద్వారానే మొత్తం సామాజిక పరివర్తన సాధ్యమని నమ్మి అందుకోసం త్రికరణ శుద్ధిగా కృషి చేశారు. భయంలేని, బహుమతులు లేని, పోలికల్లేని వాతావరణం ఇంట్లోనూ, స్కూల్లోనూ కల్పించినప్పుడు సహజంగా, సామరస్యంగా, మానవీయంగా జీవించడానికి ఆస్కారం ఉంటుందని చెప్పేవారు. గురువు ప్రాధాన్యత తక్కువగా ఉండాలని, పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడేలా విద్యా బోధన ఉండాలని, స్వతంత్రంగా సత్యాన్వేషణ చేయాలని ఆశించేవారు. ప్రయోగాత్మకంగా అటువంటి విద్యను అందించే సంస్థల ఏర్పాటు కోరుకొనే వారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 30 వరకూ సంస్థలు ఆయన స్ఫూర్తి, ప్రోత్సాహం, ప్రేరణతో ఏర్పాటయ్యాయి. బయటవారు ఇటువంటి సంస్థలను పెడితే వారినీ ఈ విధంగా చేయాలని ప్రోత్సహించేవారు.

పరిశోధనలు, శిక్షణ

గ్రామీణ పేద పిల్లలకు భాష ఎలా నేర్పాలో 1985-90 మధ్య నెల్లూరు జిల్లా పల్లెపాడులోని గాంధీ ఆశ్రమంలో లండన్‌కు చెందిన ఎలీనా వాట్స్‌తో కలసి ఐదేళ్ల ప్రయోగాలు చేశారు. రుషి వేలిలోనూ ప్రయోగాలు చేశారు. వీధిబడి భావన నేర్పించడంలో స్థితప్రజ్ఞుడుగా పేరుగాంచారు. అక్షరాస్యత ఉద్యమానికి సహకారం అందించారు. వాచకం రాసేటప్పుడు సలహాలు ఇచ్చేవారు. వేలాది మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. లక్షలమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన వద్ద శిక్షణ పొందిన ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారు.

'స్టెప్' ద్వారా అవగాహన

సృజనాత్మక విద్యను పాదుగొల్పేందుకు స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్ (స్టెప్) సంస్థ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేవారు. దీనిద్వారా ఉపాధ్యాయులకు శిక్షణా శిబిరాలు నిర్వహించారు. 'సృజన' అనే సంస్థ ద్వారా అక్షరాస్యత ఉద్యమానికి సహకారం అందించారు. తన ఆశయాలకి అనుగుణంగా కృషి చేస్తున్న విద్యా సంస్థల్లో ఆయన ఉంటుండేవారు. ఏ సంస్థలోనూ శాశ్వతంగా ఉండిపోకుండా కొన్నాళ్లు ఒకచోట, మరికొన్నాళ్లు వేరొక చోట ఉండేవారు. చివరిలో గుంటూరు జిల్లాలోని అరవింద హైస్కూల్లో ఉన్నారు. ఇక్కడే ఈ నెల 20న కన్నుమూశారు. ప్రిన్సిపల్ ఇంద్రాణి ఆయనను కన్న తండ్రిలా కంటికి రెప్పలా చూసుకున్నారు.

జన విజ్ఞాన వేదిక (జెవివి)తో బంధం

జన విజ్ఞాన వేదిక (జెవివి) విద్యా విభాగం ఏర్పాటుకు శివరాం తోడ్పాటు, సహాయ సహకారాలు అందించారు. జెవివితో కలిసి పనిచేశారు. జెవివి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రజాస్వామిక విద్య ఆయన లక్ష్యం. వృద్ధాప్యంలో కూడా ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకొనే వారు. దీనిని పిల్లలకు వారి అవసరాలకు అనుగుణంగా నేర్పించాలని సూచించేవారు. పిల్లల మేథస్సును అభివృద్ధి చేసేలా, వారు స్వతంత్రంగా ఎదిగేలా విద్యా రంగంలో నిరంతరం ప్రయోగాలు జరగాలని ఆశించేవారు. అనేక పుస్తకాలు రాశారు. వాటిలో శ్రమ జీవన విద్యా విప్లవ కావ్యం, చూడు - చేయి నేర్చుకోవడంలో విప్లవం, ప్రపంచ శాంతికి అడుగు విద్యావిప్లవం వంటివి ఉన్నాయి.

నేర్చుకుంటూ.. నేర్పిస్తూ ...

స్కూల్ ఆన్ వీల్స్ పేరుతో ప్రయోగాలు చేశారు శివరాం. అధ్యయనం కోసం ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు పంపేవారు. విద్యారంగానికి సంబంధించి మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ టాగూరు నుంచి ప్రేరణ పొందానని చెప్పుండేవారు. అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలం రాగులపాడు గ్రామంలో జన్మించిన ఆయన విద్యా రంగ అభివృద్ధికి తన జీవితాంతం కృషి చేసినా సొంతంగా విద్యా సంస్థను స్థాపించలేదు. తుదిశ్వాస విడిచే వరకూ అత్యంత నిరాడంబరంగా జీవనం గడిపారు. తనకంటూ ఏమీ లేకుండానే జీవించారు. వామపక్ష భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న ఆయన ఫ్యూడల్ భావజాలాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవారు. విదేశాలలోని భాషా మేధావులతోనూ శివరాంకు పరిచయాలు ఉన్నాయి.

నిర్మొహమాటంగా... సూటిగా...

శివరాం పాఠశాలల్లో విద్య, తాత్విక అంశాలపై చర్చా గోష్టులు నిర్వహించేవారు. జిడ్డు కృష్ణమూర్తి తాత్వికతను అనుసరించేవారు. చాలా స్పష్టతతో, బలమైన గొంతుతో మాట్లాడేవారు. విద్యా రంగానికో, రాజకీయంగా పరిమితం కాకుండా మొత్తం జీవిత మూలాలను ప్రేమ పూర్వకంగా తడుముతుండేవారు. చాలా పాఠశాలల వార్షికోత్సవాలకు హాజరై నిర్మొహమాటంగా సూటిగా మాట్లాడేవారు. శివరాం జీవితాంతం సమాజ అభ్యున్నతి కోసం పాటు పడ్డారు. మరణానంతరం భౌతికకాయాన్ని ఆయన కోరిక మేరకు ఆశ్రం మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, ఏలూరుకు అప్పగించారు. కళ్లను ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందజేశారు.

గొప్ప మానవతావాది



అనుభవంలోంచి మాట్లాడే యోగి శివరాం. పిల్లల్లో తగ్గుతున్న అటెన్షన్ గురించైనా, పెద్దల్లో పెరుగుతున్న అసహనం, అసంతృప్తిల గురించైనా లోతుగా మాట్లాడేవారు. అందరి మధ్య ఓ సామాన్యునిగా మసలేవారు. ప్రేమే ఈ ప్రపంచాన్ని నివాసయోగ్యంగా చేయగలదని.. అనేకమంది పిల్లలతో, పెద్దలతో మాట్లాడుతూ పోవడమే తన పని అని భావించేవారు. అనుభవంలోంచి ఇంత విప్లవాత్మకంగా మాట్లాడేవారు ఈ ప్రపంచంలోనే చాలా అరుదు. ఏదో ఫిలాసఫీని వల్లించడం కాకుండా దానిని నిత్యానుభవంలోంచి బోధపర్చేవారు. వింటుంటే మనల్ని మనం విడమర్చి చదువుతున్నట్లు ఉంటుంది. ఆయన గొప్ప మానవతావాది.

- బి.ఇంద్రాణి, ప్రిన్సిపాల్, అరవింద హైస్కూలు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68